# మన జనప్రగతి

జనం కోసం.. అక్షర ప్రగతి...

తెలుగు దినపత్రిక

సంపుటి : 6 | సంచిక : 180 | పేజీలు : 8 | వెల : రూ.2/- ఆదివారం 26 జులై 2026 | వైఎస్సార్ కడప

Circulated by Kadapa, Ananthapur, Chittor, Vishakapatanam, Srikakulam, Elluru, Thirupathi, Ongole, Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool


## ప్రహ్లాద్ జోషికి విద్యాశాఖ అప్పగింత

- ధర్మేంద్రప్రధాన్ రాజీనామా ఆమోదం




## ఇది ముమ్మాటికీ విద్యార్థుల విజయం

● గాంధీ నుంచే తాముశాంతిని నేర్చుకున్నాం ● ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై అభిజిత్ దీప్కే







## ఎర్రచందనం ముఠాలకు సహకరిస్తే కఠిన చర్యలు

**అధికారులకు డిప్యూటి సిఎం పవన్ హెచ్చరికలు**

**అమరావతి,మన జనప్రగతి జూలై 25:** ఎర్రచందనం అక్రమ రవాణా ముఠాలకు సహకరిస్తే ఎవరినైనా ఉపేక్షించేది లేదని ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హెచ్చరించారు. స్మగ్లింగ్‌ను అడ్డుకునేందుకు కఠినమైన ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. సీడ్‌బాల్స్ పంపిణీపై అటవీశాఖ అధికారులతో శనివారం పవన్ కల్యాణ్ సమీక్ష నిర్వహించారు. వెయ్యి ఎకరాల్లో డ్రోన్ల మిగతా2లో...

## సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తున్నాం



● సామాన్యుడిలా ప్రజల మధ్యే ఉంటా...

● వంటగదిని ఫార్మసీగా, ఆహారాన్ని ఔషధంగా మార్చుకుందాం

● ఆస్పరిలో సంజీవిని పథకం ప్రారంభించిన సిఎం చంద్రబాబు

**కర్నూలు,మన జనప్రగతి జూలై 25:** తాను సచివాలయానికే పరిమితం కాకుండా సామాన్యుడిలా ప్రజల మధ్యలోనే ఉంటానని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. కర్నూలు జిల్లాలోని ఆస్పరిలో సీఎం చంద్రబాబు పర్యటించి 'సంజీవని' ఆరోగ్య కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ ఎన్డీయే ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం సూపర్ సిక్స్ పథకాలైన తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, ఉచిత గ్యాస్ సిలిండర్లను క్రమం తప్పకుండా అమలు చేస్తున్నామని స్పష్టం చేశారు. పేదరికాన్ని నిర్మూలించడంతో పాటు నాణ్యమైన విద్య, పౌష్టికాహారాన్ని అందించడమే తమ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్యం వారి మిగతా2లో...



## ఏపిలో ఓటర్ల సంఖ్య 4,16,27,694గా నమోదు

- రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వివేక్ యాదవ్ వెల్లడి

**అమరావతి,మన జనప్రగతి జూలై 25:** ఆంధ్రప్రదేశ్‌లో మొత్తం ఓటర్ల సంఖ్య 4,16,27,694గా నమోదైందని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వివేక్ యాదవ్ వెల్లడించారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ(సర్) పక్రియలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఓటర్ల వివరాలను ఆయన అధికారికంగా ప్రకటించారు. అత్యధికంగా మిగతా2లో...

## జంతర్ మంతర్ ఆందోళనకు ముగింపు

- కేంద్రమంత్రులతో సిజెపి ప్రతినిధుల చర్చలు ఫలప్రదం
- విద్యార్థులపై దేశవ్యాప్త కేసుల ఎత్తివేతకు అంగీకారం
- భవిష్యత్‌లో ఎలాంటి కేసులతో విద్యార్థులను వేధించమని హామీ
- ఆత్మహత్య చేసుకున్న కుటుంబాలకు కోటి పరిహారం డిమాండ్



**న్యూఢిల్లీ,మన జనప్రగతి జూలై 25:** జంతర్ మంతర్ ఆందోళన ముగిసింది. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో సిజెపి చేపట్టిన ఆందోళన ముగించారు. కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, జితేంద్ర సింగ్‌లతో తాజా సమావేశం అనంతరం కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ప్రతినిధులు తమ ఆందోళనను విరమిస్తున్నామని ప్రకటించారు. జంతర్‌మంతర్ నుంచి విద్యార్థులు, యువత తిరిగి వెళ్లాలని కోరారు. మంత్రి ధర్మేంద్ర మిగతా2లో...

## విద్యార్థులే నిజమైన దేశభక్తులు

● ఉద్యమించిన విద్యార్థులకు హ్యాట్సాఫ్ ● ఖర్గే, రాహుల్, ప్రియాంకల హర్షం

**న్యూఢిల్లీ,మన జనప్రగతి జూలై 25:** కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ స్పందించారు.దేశవ్యా ప్తంగా ఉద్యమించిన విద్యార్థులకు హ్యాట్సాఫ్ చెబుతూ, వారే నిజమైన దేశభక్తులని కొనియాడారు. విద్యార్థులు తమ హక్కుల కోసం, పారదర్శకమైన విద్యా వ్యవస్థ కోసం చేసిన పోరాటం దేశ ప్రజాస్వామ్య స్ఫూర్తికి నిదర్శనమని రాహుల్ పేర్కొన్నారు. వారి ఐక్యత, పట్టుదల చూస్తే గర్వంగా ఉందని ఆయన అన్నారు. ఈ పరిణామం విద్యా రంగం లో సంస్కరణలకు దారి తీస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. 'విద్యార్థులపై ఎవరైతే దాడి చేసి, వారిని కొట్టి, వారిపై కాల్పులు జరిపారో, వారందరికీ శిక్ష పడాల్సిందే. ఈ విషయాన్ని ప్రభుత్వానికి మరోసారి గుర్తు చేస్తున్నాను' అని రాహుల్ పేర్కొన్నారు. అలాగే, దేశ విద్యార్థుల గౌరవం, వారి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని



భారత ప్రధానమంత్రి దాడులకు గురైన విద్యార్థులకు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. విద్యార్థుల ఆకాంక్షలను గౌరవిస్తూ ప్రభుత్వం విద్యా వ్యవస్థను మరింత పారదర్శకంగా, బాధ్యతాయుతంగా తీర్చిదిద్దేందుకు మిగతా2లో...

## రియల్ ఎస్టేట్ రంగంపై గోబెల్స్ ప్రచారం నమ్మొద్దు

● రెండున్నర ఏళ్లలో దాదాపు 40 శాతం రియల్ వృద్ధి

● త్వరలో మూసీ సుందరీకరణకు టెండర్లు

● రియల్ ఎస్టేట్‌తో పాటు పేదల ఇళ్ల నిర్మాణానికి ప్రాధాన్యత

● రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్ , సమాచార శాఖ మంత్రి పొంగులేటి



**హైదరాబాద్,మన జనప్రగతి జూలై 25:** రాష్ట్రంలో ముఖ్యంగా హైదరాబాద్ లో రియల్ ఎస్టేట్ రంగం కుదేలైందని కొంతమంది ఉద్దేశ పూర్వకంగా గోబెల్స్ ప్రచారం సాగిస్తున్నారని దీనిలో ఏమాత్రం నిజం లేదని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్ , సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ఈ విషయంలో స్టాంప్స్ / రిజిస్ట్రేషన్ శాఖ మంత్రిగా స్పష్టమైన ఆధారాలు, వివరాలు ఉన్నాయని అందువలన అటువంటి ప్రచారాలను నమ్మాల్సిన అవసరం లేదని అన్నారు. శనివారం నాడు నగరంలో జరిగిన ఒక కార్యక్రమంలో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ గత రెండున్నర సంవత్సరాల ప్రజా ప్రభుత్వ పాలనలో సుమారు 15 నుంచి 20 శాతం రియల్ ఎస్టేట్ అభివృద్ధి జరిగిందని , మిగతా2లో...



## ఎల్‌నినోతో రైతులకు అండగా నిలవండి

● డ్రిప్ ఇరిగేషన్‌కు ప్రోత్సహించండి ● మైక్రో ఇరిగేషన్ కంపెనీలకు మంత్రి తుమ్మల సూచన

**హైదరాబాద్,మన జనప్రగతి జూలై 25:** ఎల్-నినో సమయంలో రైతులకు అండగా నిలవాలని మైక్రో ఇరిగేషన్ కంపెనీలకు మంత్రి తుమ్మల పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఎల్-నినో సవాళ్లకు డ్రిప్, తుంపర సేద్యమే పరిష్కార మార్గమని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ సచివాలయంలో మైక్రో ఇరిగేషన్ కంపెనీలతో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమావేశమయ్యారు. డ్రిప్ వ్యవస్థల ఏర్పాటును వేగవంతం చేయాలని ఆ కంపెనీలకు మంత్రి సూచించారు. మిగతా2లో...

## డిఎస్సీపై వైసిపి పదేపదే అసత్య ఆరోపణలు

- మండిపడ్డ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి
- ఆర్టీసిని ప్రైవేట్ పరం చేయబోమని హామీ



మన జనప్రగతి
తెలుగు దినపత్రిక
26- 07 - 2026

# జంతర్ మంతర్ ఆందోళనకు ముగింపు

(మొదటి పేజీ తరువాయి)

ప్రధాన్ రాజీనామాతో తమకు తొలి విజయం దక్కిందని అన్నారు. నిరసనల సందర్భంగా విద్యార్థులపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లను ఎత్తేసేందుకు కేంద్రం అంగీకరించిందని అన్నారు. నీట్ పేపర్ లీక్ బాధిత కుటుంబాలకు రూ.1 కోటి పరిహారం ఇవ్వాలన్న డిమాండ్‌కు కేంద్రం సానుకూలంగా స్పందించిందని అన్నారు. తాము ఆశించిన చర్యలను కేంద్రం త్వరిత గతిన తీసుకుంటుందన్న విశ్వాసంతో ఆందోళనను విరమిస్తున్నామని అన్నారు. వ్యవహారానికి బాధ్యత వహిస్తూ ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలన్న ప్రధాన డిమాండ్ నెరవేరడంతోపాటు, మిగతా వాటినీ నెరవేర్చేందుకు కేంద్రం అంగీకరించిన నేపథ్యంలో నిరసనలు విరమిస్తున్నట్లు సీజేపీ ప్రకటించింది. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసిన అనంతరం కేంద్రంతో సీజేపీ నేతలు మరోసారి చర్చలు జరిపారు. అనంతరం కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, జితేంద్ర సింగ్‌తో కలిసి సీజేపీ ప్రతినిధులు మీడియాతో మాట్లాడారు. నిరసనకారులపై నమోదైన కేసులను కొట్టివేయాలని కేంద్రాన్ని కోరినట్లు తెలిపారు. కేవలం దిల్లీలోనే కాకుండా దేశవ్యాప్తంగా నమోదైన కేసులను కొట్టివేయాలని కోరినట్లు చెప్పారు. నాలుగు రోజుల్లో కేసులు విత్‌డ్రా చేస్తామని కేంద్రం హామీ ఇచ్చింది. భవిష్యత్‌లోనూ కేసులతో వేధించబోమని స్పష్టత ఇచ్చింది. నీట్ లీక్ వల్ల ఆత్మహత్య చేసుకున్న కుటుంబాలకు పరిహారం ఇచ్చేందుకు, విద్యావ్యవస్థలో సమూల మార్పులకు కేంద్రం అంగీకరించిందని తెలిపారు. నిరసనకారులపై పెట్టిన కేసులు ఎత్తివేసేందుకు అంగీకరించినట్లు కేంద్ర మంత్రి జేపీ నడ్డా తెలిపారు.

దిల్లీ, భాజపా పాలిత రాష్ట్రాల్లో పెట్టిన కేసులను ఎత్తివేస్తామన్నారు. విద్యావ్యవస్థ, పరీక్షల్లో సమూల మార్పులు చేస్తామని ఇప్పటికే చెప్పాం. భవిష్యత్‌లో ఎవరినీ కేసులతో వేధించబోము. ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు అండగా ఉంటాం' అని జేపీ నడ్డా మీడియా ఎదుట హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో ఆందోళన విరమిస్తున్నట్లు సీజేపీ ప్రతినిధులు ప్రకటించారు. ఆందోళనకారులు క్షేమంగా ఇళ్లకు చేరుకోవాలని కోరారు. సీజేపీ ప్రతినిధులతో కలిసి మీడియా సమావేశంలో పాల్గొన్న కేంద్ర మంత్రి జేపీ నడ్డా వారితో సుదీర్ఘంగా చర్చించామని అన్నారు. నీట్ ఆందోళనల్లో పాల్గొన్న విద్యార్థులపై కేసులు ఎత్తేస్తామని చెప్పారు. ఆత్మహత్య చేసుకున్న విద్యార్థులకు నిబంధనలకు లోబడి పరిహారం ఇస్తామని చెప్పారు. కేంద్ర మంత్రి పదవికి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై చేయడంపై సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే స్పందించారు. జంతర్ మంతర్ వేదికగా ఆయన మాట్లాడుతూ బొద్దింకల సత్తా అందరికీ తెలిసొచ్చిందని అన్నారు. నీట్ పేపర్ లీక్ బాధితులకు న్యాయం దక్కిందని వ్యాఖ్యానించారు. బొద్దింకలు ఒకసారి వస్తే వెళ్లగొట్టడం సాధ్యం కాదని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. ఇది విద్యార్థుల విజయమని అన్నారు. తమని తాము బాద్షాలుగా భావిస్తున్న వారిని దారిలోకి తేవాల్సిన అవసరం ఉందని అన్నారు. యువత ఓట్లతోనే వారు నేడు అధికారంలో ఉన్నారని అన్నారు. ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదని చెప్పారు. పాలకులను అదుపులో ఉంచాల్సిన అవసరం ఉందని కూడా ఉన్నారు. తాము పెట్టిన రెండు డిమాండ్స్ ఇంకా మిగిలే ఉన్నాయని దీప్కే అన్నారు. అవి సాధించేవరకూ ముందుకు సాగుతూనే ఉంటామని అన్నారు.

# డిఎస్సీపై వైసిపి పదేపదే అసత్య ఆరోపణలు

**విశాఖపట్నం,మన జనప్రగతి జూలై 25:**ఏపీలో డీఎస్సీ నియామకాలపై వైసీపీ చేస్తున్న ఆరోపణలపై మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రి నారా లోకేశ్‌పై వైసీపీ చేస్తున్న ఆరోపణలు నిరాధారమైనవని మంత్రి మండిపడ్డారు. వైసీపీకి ఆరోపణలు చేయడం తప్ప ఆధారాలు చూపించే అలవాటు లేదని విమర్శించారు. తాడేపల్లిలో జగన్ ఇంటి సమీపంలోనే ఉండి లోకేశ్ డీఎస్సీపై సవాల్ విసిరారని, దానిపై స్పందించేందుకు జగన్ ఎందుకు ముందుకు రాలేదని ప్రశ్నించారు. డీఎస్సీ నియామకాలపై ఎలాంటి అనుమానాలు ఉన్నా చట్టబద్ధంగా విచారణకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. ప్రభుత్వం నుంచి అధికారికంగా వివరాలు ఇచ్చినప్పటికీ వైసీపీ రాజకీయ దివాళాకోరుతనంతో విమర్శలు చేస్తోందని మంత్రి మండిపల్లి అన్నారు. తప్పుడు ప్రచారాలతో యువతను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలను వెంటనే మానుకోవాలని సూచించారు. నిరాధార ఆరోపణలతో ప్రభుత్వ ప్రతిష్ఠను దెబ్బతీయడమే వైసీపీ లక్ష్యమని ఆరోపించారు. డీఎస్సీ నియామకాలు చేపట్టలేని వారు రాజకీయ రంగు పులిమి విమర్శలు చేయడం సరికాదని, ప్రజా సమస్యలపై చర్చించకుండా తప్పుడు ప్రచారాలతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం ఉన్నంతవరకు ఏపీఎస్ఆర్టీసీని ప్రైవేటుపరం చేయబోమని.. అపోహలకు తావు లేదని రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి స్పష్టం చేశారు. విశాఖలో సింహపురి ఈ-బస్సు డిపో పవర్ రూమ్‌ను మంత్రి ప్రారంభించారు. రవాణా రంగంలో పీఎం ఈ-బస్ సేవతో నూతనశకం మొదలైందన్నారు. మరో రెండు నెలల్లో తొలి దశలో 750 ఈ- బస్సులు రానున్నాయని, అందులో విశాఖకు 100 బస్సులు కేటాయించనున్నట్టు చెప్పారు. ప్రస్తుత బస్సులతో పాటు, కొత్త ఈ- బస్సులతో ప్రయాణికులకు మరింత మెరుగైన సేవలందిస్తామన్నారు. పర్యావరణ హిత, ఆధునిక ప్రజారవాణా వ్యవస్థ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి స్పష్టం చేశారు.

# రియల్ ఎస్టేట్ రంగంపై గోబెల్స్ ప్రచారం నమ్మొద్దు

(మొదటి పేజీ తరువాయి)

40 శాతం వరకు ఎలాట్ల విక్రయాలు వృద్ధిచెందాయని అన్నారు. గడచిన పదేళ్లతో పోలిస్తే ఈ రెండున్నర ఏళ్లలో రెసిడెన్షియల్ మార్కెట్ విశేషంగా పెరిగిందని, దీనికి సంబంధించి తమ స్టాంప్స్ / రిజిస్ట్రేషన్ శాఖలో పెరిగిన రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ల సంఖ్యనే నిదర్శనమన్నారు. రియల్ ఎస్టేట్ పడిపోయిందని కొంత మంది పనిగట్టుకొని ఈ ప్రభుత్వంపై బురద చల్లేందుకు ఈ గోబెల్స్ ప్రచారం సాగిస్తున్నారని వాటిని పట్టించుకోవద్దని మంత్రి అన్నారు. 2004 నుంచి 2014 వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో నాటి కాంగ్రెస్ ముఖ్యమంత్రుల చొరవ కారణంగానే హైదరాబాద్ ఒక రోల్ మోడల్‌గా రూపొందిందని, వారి దూరదృష్టి వల్లే ఓఆర్ఆర్, అంతర్జాతీయ విమానాశ్రయం, ఐటి సెక్టార్ తదితరాలు 360 డిగ్రీల కోణంలో అభివృద్ధి చెందాయని వివరించారు. అందువల్లే హైదరాబాద్ ఇప్పుడు దేశంలోనే గాక ప్రపంచంలోనే అందరి దృష్టిని ఆకర్షిస్తోందని, ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిగారితో కలసి దావోస్ వెళ్లినపుడు అక్కడ కూడా అధికశాతం పారిశ్రామిక వేత్తలు హైదరాబాద్ లో పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి చూపుతున్నారన్నారు. హైదరాబాద్ నగరం పెట్టుబడులకు గమ్యస్థానం అవుతుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి దూరదృష్టితో ప్రణాళికా బద్దంగా హైదరాబాద్ నగరాభివృద్ధికి చర్యలు చేపట్టారు. 7వేల కోట్లతో చేపడుతున్న మూసీ ప్రాజెక్ట్ సుందరీకరణ పట్టాలెక్కనుందని మంత్రి పొంగులేటి తెలిపారు. 28 కిలోమీటర్ల తొలి విడత అభివృద్ధికి వారం పది రోజుల్లో టెండర్లు పిలవబోతున్నామని చెప్పారు. అదేవిధంగా పాత బస్తీ తదితరాలను కలుపుతూ రెండవ విడతగా 76 కిలోమీటర్ల మేర 24వేల కోట్లరూపాయిల ఖర్చుతో మెట్రో విస్తరణ కార్యక్రమం ప్రారంభం కానుందని తెలిపారు. ఇవేగాక ట్రిబుల్ ఆర్ నుంచి ఓఆర్ఆర్ కలుపుతూ రేడియల్ రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధమవుతున్నాయని తెలిపారు.ప్రపంచంలోనే సుందరనగరమైన హైదరాబాద్ ను రియల్ ఎస్టేట్ రంగం పక్షాన కూడా మరింత అభివృద్ధి చెందడానికి రియల్ ఎస్టేట్ రంగ ప్రతినిధులు సహకారం అవసరమని, ప్రజలకు నమ్మకంగా, సకాలంలో ఎ÷-లాట్లను అందించి వారి అభిమానాన్ని చూరగొనాలని మంత్రి హితవు పలికారు. రాష్ట్రంలో భూముల భద్రత , భరోసా కల్పించేందుకు భూభారతి చట్టాన్ని తీసుకువచ్చామని , వీటిలో కొన్ని చిన్న చిన్నసమస్యలను సాఫ్ట్ వేర్ పరంగా 15-20 రోజుల్లో సరిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. కేవలం రియల్ ఎస్టేట్ రంగం కోసమే గాకుండా పేదలకు ఇందిరమ్మ ఇళ్లు అందించేందుకు క్యూర్ పరిధిలో తొలివిడతగా లక్ష ఇందిరమ్మ ఇళ్లు అందించేందుకు నిర్ణయించామని, దీని తర్వాత దఫదఫాలు ఇళ్ల మంజూరు ఉంటుందని మంత్రి చెప్పారు. ప్రజలకు ఇళ్ల నిర్మాణానికి 2-3 లక్షల చదరపు అడుగుల స్థల సేకరణకు ప్రయత్నిస్తున్నామని చెబుతూ రియల్ ఎస్టేట్ రంగ ప్రతినిధుల కోరిక మేరకు ఫాస్ట్ ట్రాక్ సౌకర్యాన్ని కల్పించేందుకు ప్రయత్నిస్తామని మంత్రి పొంగులేటి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం ఎంపీ రఘురామ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఎల్‌నినోతో రైతులకు అండగా నిలవండి

(మొదటి పేజీ తరువాయి)

పెండింగ్‌లో ఉన్న డ్రిప్ పనులకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. బీఎంఎస్, బీఓక్యూలను పూర్తి చేసి వెంటనే అనుమతుల కోసం పంపాలని ఆదేశించారు. క్షేత్రస్థాయి పరిశీలన, పరిపాలనా అనుమతుల్లో జాప్యానికి తావివ్వొద్దని మంత్రి తుమ్మల సూచించారు. డ్రిప్ వ్యవసాయ పద్ధతిలో తక్కువ నీరు, విద్యుత్ ఉపయోగించి అధిక దిగుబడి సాధించవచ్చని మంత్రి తుమ్మల పేర్కొన్నారు. పంటల వైవిధ్యీకరణకు మైక్రో ఇరిగేషన్ కీలకమని అన్నారు. ఆయిల్‌పామ్ సాగుకు డ్రిప్ సదుపాయాలను వెంటనే కల్పించాలని మైక్రో ఇరిగేషన్ కంపెనీలకు హుకుం జారీ చేశారు. అవగాహన కార్యక్ర మాల్లో ఆయా కంపెనీలు తప్పనిసరిగా పాల్గొనాలని, పెండింగ్ బిల్లుల చెల్లింపునకు కృషి చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. గత రెండేళ్లలో మైక్రో ఇరిగేషన్ కంపెనీలకు కాంగ్రెస్ ప్రభుత్వం రూ.400 కోట్లు చెల్లించిందని ఈ సందర్భంగా వెల్లడించారు. కంపెనీల పనితీరుపై జిల్లాల వారీగా నిరంతర సమీక్ష నిర్వహిస్తామని పేర్కొన్నారు. సూక్ష్మ సాగునీటి విస్తరణలో దేశానికి తెలంగాణ ఆదర్శంగా నిలవాలని మంత్రి తుమ్మల ఆకాంక్షించారు.

# గుజరాత్‌లో వరదల బీభత్సం

● వల్సాద్‌లో నీట మునిగిన గృహసముదాయాలు



**గాంధీనగర్,మన జనప్రగతి జూలై 25:**గుజరాత్‌లోని వల్సాద్‌లో భారీ వర్షాలకు నివాస సముదాయాలు నీట మునిగాయి. ఓ వ్యక్తి తన ఇంటి బయట వరద నీటిలో నిలబడి ఉన్న వీడియో వైరల్ అయింది. ఇక్కడ పరిస్థితులు ఎంత దారుణంగా ఉన్నాయో ఆ వీడియో చూస్తే తెలుస్తోంది. ఇటీవల ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాల కారణంగా వీధులు, రోడ్లు పూర్తిగా నీట మునిగిపోవడంతో, సదరు యువకుడు తన ఇంటి బయట మెడలోతు వరద నీటిలో నిలబడి పరిస్థితిని వివరించాడు. పార్క్ చేసిన వాహనాలు, ప్రహరీలు, భవనాల పైభాగాలు మాత్రమే బయటకు కనిపిస్తున్న ఈ దృశ్యాలు వరద తీవ్రతను స్పష్టంగా చూపిస్తున్నాయి. ఈ వీడియోలో సదరు వ్యక్తి మునిగిపోయే స్థాయిలో నీరు చేరడం చూసి నెటిజన్లు షాక్ అవుతున్నారు. వీధులు, ఖాళీ స్థలాల మధ్య తేడా తెలియకుండా అంతా జలమయం కావడంతో అక్కడి నివాసితుల దైనందిన జీవితం పూర్తిగా స్తంభించిపోయింది. పట్టణాల్లో అరకొరగా ఉన్న మురుగునీటి పారుదల వ్యవస్థలు, ఈ తరహా ముంపునకు ప్రధాన కారణమని ఆన్‌లైన్‌లో పెద్ద ఎత్తున విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ దృశ్యాలు చూసిన పలువురు నెటిజన్లు శివమ్ సింగ్, ఇతర నివాసితులు సురక్షితంగా ఇళ్లలోనే ఉండాలని కోరారు. మరోవైపు అధికారులు, రెస్క్యూ టీమ్ ఇప్పటికే పలువురిని సురక్షిత ప్రదేశాలకు తరలించినట్లు సమాచారం.

# ప్రహ్లాద్ జోషికి విద్యాశాఖ అప్పగింత

● ధర్మేంద్రప్రధాన్ రాజీనామా ఆమోదం

**న్యూఢిల్లీ,మన జనప్రగతి జూలై 25:**ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా అనంతరం విద్యాశాఖ బాధ్యతలను కేంద్ర ప్రభుత్వం మరో మంత్రి ప్రహ్లాద్ జోషికి అప్పగించింది. ప్రస్తుతం కన్జ్యూమర్ ఎఫైర్స్ శాఖ మంత్రిగా ఉన్న ఆయనకు అదనపు బాధ్యతలు అప్పగించింది. ప్రధాని సలహా మేరకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రహ్లాద్ జోషికి విద్యాశాఖను కేటాయిస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఇక ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాను కూడా రాష్ట్రపతి ఆమోదించారు. కర్ణాటకలోని ధార్వాడ్ ప్రాంతానికి ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రహ్లాద్ జోషి.. ఆహార, ప్రజాసరఫరా వ్యవహారాలు, పునరుత్పాదక ఇంధన శాఖ వ్యవహారాలను కూడా పర్యవేక్షిస్తున్నారు. భారత్ చొరవతో ఏర్పాటు చేసిన ఇంటర్నేషనల్ సోలార్ అలయన్స్‌కు ప్రెసిడెంట్‌గా ఉన్నారు.

# ఇది ముమ్మాటికీ విద్యార్థుల విజయం

**న్యూఢిల్లీ,మన జనప్రగతి జూలై 25:**నీట్ పేపర్ లీక్‌కు వ్యతిరేకంగా కాక్రోచ్ జనతా పార్టీ చేపట్టిన ఆందోళనల నేపథ్యంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేశారు. దీనిపై సీజేపీ హర్షం వ్యక్తం చేసింది. 'ఇది విద్యార్థుల విజయం' అంటూ ఎక్స్‌లో పోస్ట్ చేసింది. ప్రధాన్ రాజీనామాతో దిల్లీలోని జంతర్ మంతర్ వద్ద విద్యార్థులు సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే మాట్లాడుతూ.. 'శాంతియుతంగా చేసే ఏ ఆందోళనతో అయినా లక్ష్యం తప్పకుండా నెరవేరుతుంది. దీన్ని గాంధీజీ నుంచి నేర్చుకున్నా. ఈ దేశ యువత శాంతియుత నిరసనలు వృథాగా పోలేదు. విద్యార్థుల పోరాటం ఫలించింది. వారి సత్తా ఏంటో తెలిసింది. ఈ విజయం విద్యార్థులందరిది. ప్రజాస్వామ్యం అంటే ఇదే అని ఆనందం వ్యక్తం చేశారు. మాకు రాజకీయాలు అవసరం లేదు. మా డిమాండ్లలో ఒకటి నెరవేరింది. మిగతా రెండూ నెరవేరే వరకు వేచి చూస్తాం. విద్యార్థులపై దాడి చేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలి. విద్యార్థులపై పెట్టిన అన్ని కేసులు పూర్తిగా ఎత్తివేయాలి. విద్యావ్యవస్థను ప్రక్షాళన చేసే వరకు ఈ ఉద్యమం ఆగదు. ఈ సాయంత్రం 6.30 గంటలకు కొవ్వొత్తులతో ర్యాలీ చేద్దాం అని సీజేపీ నేతలు యువతకు పిలుపునిచ్చారు.

# ఎర్రచందనం ముఠాలకు సహకరిస్తే కఠిన చర్యలు

(మొదటి పేజీ తరువాయి)

సాయంతో సీడ్ బాల్స్ విసురుతామన్నారు. అటవీ విస్తీర్ణం పెరిగేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఎర్ర చందనం అక్రమ రవాణాను ఏ విధంగా అరికడుతున్నదీ ఎప్పటికప్పుడు సమీక్షిస్తానని తెలిపారు. కడప జిల్లాలో రూ.1.5 కోట్ల విలువైన 78 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్న ఘటనపై అధికారులతో మాట్లాడారు. ఇద్దరు అంతర్రాష్ట్ర స్మగ్లర్లతోపాటు వారికి సహకరిస్తున్న ఫారెస్ట్ బీట్ ఆఫీసర్‌ను అరెస్టు చేసినట్లు అధికారులు పవన్‌కు తెలియజేశారు.

# సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తున్నాం

(మొదటి పేజీ తరువాయి)

చేతుల్లోనే ఉందని వ్యాఖ్యానించిన సీఎం.. వంటగదిని ఫార్మసీగా, ఆహారాన్ని ఔషధంగా మార్చుకుంటే ఆసుపత్రుల చుట్టూ తిరిగే అవసరం ఉండదని హితవు పలికారు. సాంకేతికతను జోడిస్తూ 'ఏఐ డాక్టర్' సేవలను అందుబాటులోకి తెచ్చి, ప్రతి ఒక్కరి హెల్త్ ప్రొఫైల్‌ను డిజిటలైజ్ చేస్తామని వెల్లడించారు. భూ హక్కులకు భద్రత కల్పించేందుకు 'బ్లాక్ చైన్ టెక్నాలజీ'ని వినియోగిస్తున్నట్లు తెలిపారు. కరవు పరిస్థితుల నేపథ్యంలో రైతులు ఆలోచించి పంటలు వేయాలని విజ్ఞప్తి చేస్తూనే, ఆలూరు ప్రాంతంలో తాగునీరు, రోడ్ల సమస్యలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. రాయలసీమ సస్యశ్యామలానికి కట్టుబడి ఉన్నామని పునరుద్ఘాటించిన చంద్రబాబు, వేదవతి ప్రాజెక్టును త్వరలోనే పూర్తి చేసి హంద్రీనీవా కాలువ ద్వారా నీటిని తరలిస్తామని హామీ ఇచ్చారు. 2027 మార్చి నాటికి పోలవరం ప్రాజెక్టును, 2028 నాటికి రాయలసీమ స్టీల్ ఫ్యాక్టరీని పూర్తి చేస్తామని స్పష్టమైన గడువు విధించారు. గత ప్రభుత్వ హయాంలో ఎలాంటి అభివృద్ధీ జరగ లేదని విమర్శిస్తూ, శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే సహించేది లేదని తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు.

# ఎపిలో ఓటర్ల సంఖ్య 4,16,27,694గా నమోదు

(మొదటి పేజీ తరువాయి)

44,89,488 మంది ఓటర్లకు సరైన అడ్రస్ లేదని సీఈఓ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 15,22,174 మంది ఓటర్లు మరణించినట్లు వెల్లడించారు. అలాగే, 14,43,886 మంది ఓటర్లు మరో చోటుకు బదిలీ అయ్యారని, ఇతర ప్రాంతాల్లో కొత్తగా నమోదైన ఓటర్ల సంఖ్య 7,37,216 గా ఉందన్నారు. ఆచూకీ లభించని ఓటర్ల సంఖ్య 7,77,885 గా తేలిందని సీఈఓ తెలిపారు. అలాగే ఇతర కేటగిరీల కింద మరో 8,327 మంది ఓటర్లు ఉన్నారని వివేక్ యాదవ్ వివరించారు. అర్హులైన వారు మళ్లీ ఓటరుగా నమోదు చేసుకునేందుకు ఎన్నికల సంఘం మరో అవకాశాన్ని కల్పిస్తోందన్నారు. ఈ నెల 31 నుంచి ఆగస్టు 30 వరకు సరైన డాక్యుమెంట్లను చూపించి, మరలా ఓటర్‌గా నమోదు చేసుకునేందుకు అవకాశం ఇస్తున్నట్లు సీఈఓ వివేక్ యాదవ్ ప్రకటించారు.

# విద్యార్థులే నిజమైన దేశభక్తులు

(మొదటి పేజీ తరువాయి)

చర్యలు తీసుకోవాలని రాహుల్ గాంధీ సూచించారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడంపై కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ హర్షం వ్యక్తం చేశారు. ఇది దేశ యువత సాధించిన విజయమని ఆమె పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజల ఆకాంక్షలే అంతిమమని, యువత తమ గళాన్ని వినిపించి కేంద్ర ప్రభుత్వానికి గుణపాఠం చెప్పిందని అన్నారు. విద్యా వ్యవస్థలో నెలకొన్న సమస్యలపై విద్యార్థులు చేసిన పోరాటం ఫలించిందని ప్రియాంక గాంధీ వ్యాఖ్యానించారు. ఇది కోట్లాది మంది విద్యార్థుల విజయమని తెలిపారు. విద్యా వ్యవస్థలో మార్పులు తీసుకురావాలనే లక్ష్యంతో విద్యార్థులు పెద్ద ఎత్తున ఉద్యమించారని, వారి పోరాటం దేశవ్యాప్తంగా చర్చకు దారితీసిందని అన్నారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం మరింత బాధ్యతగా వ్యవహరించాలని కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేశారు. విద్యా వ్యవస్థలో పారదర్శకత, నాణ్యత పెంచేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

# ధర్మేంద్ర రాజీనామాపై వాంగ్‌చుక్ హర్షం



**న్యూఢిల్లీ,మన జనప్రగతి జూలై 25:** కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ హర్షం వ్యక్తం చేశారు. ఇది పట్టుదలతో యువత సాధించిన విజయని పేర్కొన్నారు. జెన్-జీ, సీజేపీ ప్రతినిధులకు అభినందనలు తెలియజేశారు. ఈ మేరకు తన ఎక్స్ ఖాతాలో శనివారం ఓ పోస్టు పెట్టారు. ఆ పోస్టులో.. ఇది ప్రజాస్వామ్యం సాధించిన విజయం. ఇది శాంతి, ఓర్పు, నిరంతర పట్టుదలల విజయం. దేశంలోని సీజేపీ, జెన్ జీ యువతకు అభినందనలు. భయాన్ని వీడి దేశం నలుమూలల నుంచి పోరాటానికి కదలివచ్చిన పౌరులందరికీ ధన్యవాదాలు. ఇప్పటివరకు బాధ్యతాయుతమైన సమాధానం కోరాం. ఇకపై సంస్కరణల వైపు సాగుదాం' అని రాసుకొచ్చారు.

# కలికిరి ఎస్టీ కాలనీలో ఏకలవ్య జయంతి వేడుకలు



**కలికిరి మన జనప్రగతి జూలై 25:**–అన్నమయ్య జిల్లా కలికిరి పట్టణంలోని ఎస్టీ కాలనీలో శుక్రవారం ఏకలవ్య జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ ఆదివాసి ఎరుకల సేవా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీనివాస వర్మ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గిరిజన నాయకులు, యువత, మహిళలు పాల్గొని ఏకలవ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాస వర్మ మాట్లాడుతూ ఏకలవ్య త్యాగం, గురుభక్తి, ఆత్మవిశ్వాసానికి ప్రతీకగా నిలిచారని అన్నారు. గిరిజన యువత విద్యతో పాటు నైపుణ్యాలను పెంపొందించుకుని సమాజ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. గిరిజనుల విద్యా, సామాజిక అభివృద్ధికి ప్రభుత్వం మరింత ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. గిరిజన నాయకుడు జానం గంగిరెడ్డి మాట్లాడుతూ గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడం అందరి బాధ్యత అని పేర్కొన్నారు. ఏకలవ్య జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని విద్య, ఉపాధి, సామాజిక సేవా రంగాల్లో రాణించాలని యువతకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బి. నాగయ్య, ఎస్. వెంకటరమణ, బండి రెడ్డప్ప, కే. నాగయ్య, శివకుమార్, క్రాంతికుమార్, దాసరి శ్రీనివాసులు, జగన్నాథం గౌరీ, జీవశాస్త్ర ఉపాధ్యాయిని జానం సుజాత తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణ కోసం మనమంతా పాటుపడాలి




**ఎమ్మిగనూరు/మాధవరం మన జనప్రగతి జూలై 25:**పర్యావరణ పరిరక్షణ కోసం మనమందరం బాధ్యతాయుతంగా పాటుపడాలని ఎమ్మిగనూరు మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ మరియు,జూనియర్ సివిల్ జడ్జి పి. హేమ అన్నారు. శనివారం కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు మండలం మాధవరం తండాలో ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ అడవులను సంరక్షిస్తే మంచి వర్షాలు వస్తాయని, అలాగే ప్రతి మనిషికి కావలసిన ఆరోగ్యకరమైన గాలి, నీరు లభించే అవకాశాలు ఉంటాయన్నారు. చెట్లను నరకడం వల్ల వర్షాలు సకాలంలో పడక కరువులు నెలకొంటాయని,దీంతో జీవజాతులకు,పశుపక్షాదులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందన్నారు. అందుకే ప్రతి ఒక్కరూ ప్రకృతిని పరిరక్షించే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. నేడు మనం ప్రకృతిని సంరక్షించి మన భావితరాలకు వరంగా అందించాలని కోరారు. చెట్లు నరికిన వారిపై ఫారెస్ట్ యాక్ట్ ప్రకారం చర్యలు ఉంటాయని, అలాగే అడవుల్లో జీవజాతులను సైతం సంహరిస్తే కఠిన శిక్షలు ఉంటాయని తెలియజేశారు.ప్రతి ఒక్కరూ బాధ్యత విధంగా వనాలను కాపాడాలని, చెట్లను పెంచాలని, జీవజాతులను కాపాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ విజయభాస్కర్ రెడ్డి,న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు రసీదుల్లా, కార్యదర్శి మల్లికార్జున,ఇతర న్యాయవాదులు లింగమూర్తి, చిన్న వీరేష్, శ్రావణి, పోలీస్ సిబ్బంది, న్యాయ సేవాధికార సంస్థ క్లర్క్ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

# ఆస్పరిలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు మంత్రులు, నాయకులు ఘన స్వాగతం




**కర్నూలు బ్యూరో ఆస్పరి మన జనప్రగతి జూలై 25:**–ప్రజల ఆరోగ్య భద్రత కోసం డిజిటల్ హెల్త్ రికార్డులు నిర్వహించేలా సంజీవని కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు కర్నూలు జిల్లా ఆలూరు తాలూకా ఆస్పరి మండలానికి వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కు హెలిపాడ్ వద్ద మంత్రులు రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, రాష్ట్ర మంత్రులు నిమ్మల రామానాయుడు, టీజీ భరత్, ఎంపీ. బస్తిపాటి నాగరాజు, ఆలూరు టిడిపి ఇన్చార్జ్ వైకుంఠం జ్యోతి దంపతులు, కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి, పత్తికొండ ఎమ్మెల్యే కే.ఈ. శ్యాం కుమార్, ఆదోని ఎమ్మెల్యే పార్థసారధి, కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ. సిరి, ఎస్పీ విక్రాంత్ పాటిల్, ఇతర పార్టీ నాయకులు తదితరులు ఘన స్వాగతం పలికారు.

# తల్లిదండ్రులకు విద్యపై అవగాహన కార్యక్రమం

**- పదవ తరగతిలో ఉత్తమ ప్రతిభను కనబరిచిన వారిని అభినందించారు**

**గాలివీడు మన జనప్రగతి జులై 25:–** గాలివీడు మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించిన పేరెంట్స్ మీటింగ్ కార్యక్రమాల్లో టీడీపీ గాలివీడు మండల ప్రధాన కార్యదర్శి కసిరెడ్డి వెంకట శివారెడ్డి పాల్గొన్నారు. గోరాన్ చెరువు గ్రామ పంచాయతీ పరిధిలోని పెద్దపల్లి ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి పాల్గొని, విద్యార్థులకు స్వీట్లు మరియు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం ఒడిశిలంక ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన పేరెంట్స్ మీటింగ్‌లో కూడా పాల్గొని,అక్కడి విద్యార్థులకు స్వీట్లు,పండ్లు అందజేశారు. అదేవిధంగా గాలివీడు మండలం కస్తూర్బా స్కూల్ పాఠశాలలో పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందిస్తూ, ప్రథమ స్థానంలో ఉత్తీర్ణులైన వారికి రూ.2116 నగదు ప్రోత్సాహకం. ద్వితీయ స్థానంలో ఉత్తీర్ణులైన వారికి రూ.1116 నగదు బహుమతిని కసిరెడ్డి వెంకట శివారెడ్డి ఆధ్వర్యంలో అందజేశారు.ఈ కార్యక్రమాల ద్వారా విద్యార్థులను ప్రోత్సహించడం, తల్లిదండ్రుల్లో విద్య పట్ల మరింత అవగాహన కల్పించడం లక్ష్యంగా కార్యక్రమాలు నిర్వహించబడినట్లు నిర్వాహకులు తెలిపారు.పాఠశాలల యాజమాన్యం,తల్లిదండ్రులు, విద్యార్థిని, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



# అభివృద్ధి అజెండాతోనే పాలన సాగిస్తున్నాం: సీఎం చంద్రబాబు








**కర్నూలు జిల్లాలో మహిళా సంఘాలకు రూ.197 కోట్ల ఆర్థిక సాయం**

**ఆగస్టు నుంచి రాష్ట్రవ్యాప్తంగా 'సంజీవని' అమలు**

**వేదవతి ప్రాజెక్టు, కడప స్టీల్ ప్లాంట్ పూర్తి చేస్తాం**

**కర్నూలు బ్యూరో/ఆస్పరి మన జనప్రగతి జూలై 25:**–రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించడమే తమ ప్రభుత్వ అజెండా అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. సీఎం అంటే సచివాలయంలో ఉండే ముఖ్యమంత్రి మాత్రమే కాదని, ప్రజల మధ్య ఉండే "కామన్ మ్యాన్" అనే భావనతోనే తాను నిత్యం ప్రజలతో మమేకమవుతున్నానని పేర్కొన్నారు. శనివారం కర్నూలు జిల్లా ఆస్పరి మండలంలో నిర్వహించిన 'సంజీవని' కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించి మాట్లాడారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకొని వాటి పరిష్కారానికి ప్రజా పాలసీలు రూపొందిస్తున్నామని తెలిపారు. ఆగస్టు నుంచి రాష్ట్రవ్యాప్తంగా 'సంజీవని' అమలు చేసి ప్రతి కుటుంబానికి ఆరోగ్య భద్రత కల్పిస్తామని చెప్పారు. ఆభా హెల్త్ ఐడీలు, డిజిటల్ హెల్త్ రికార్డులు, టెలీమెడిసిన్, ఏఐ ఆధారిత వైద్య సేవలను అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. మహిళల సాధికారత కోసం స్త్రీశక్తి, దీపం-2.0 వంటి పథకాలను అమలు చేస్తున్నామని, భూ రికార్డులను బ్లాక్‌చైన్ సాంకేతికతతో భద్రపరుస్తున్నామని చెప్పారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని, జలధార కార్యక్రమం ద్వారా భూగర్భ జలాలను పెంచేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. వేదవతి లిఫ్ట్ ఇరిగేషన్ పథకాన్ని రూ.1,768 కోట్లతో పూర్తి చేసి ఈ ప్రాంతానికి సాగునీరు అందిస్తామని, 2028 నాటికి కడప స్టీల్ ప్లాంట్‌లో ఉత్పత్తి ప్రారంభిస్తామని పేర్కొన్నారు. అనంతరం కర్నూలు జిల్లాలోని స్వయం సహాయ సంఘాల మహిళలకు రూ.197 కోట్ల చెక్కును ముఖ్యమంత్రి అందజేశారు. ఈ కార్యక్రమంలో బోయ కార్పొరేషన్ చైర్‌పర్సన్ కప్పట్రాళ్ల బొజ్జమ్మ, మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు, టీడీపీ జిల్లా అధ్యక్షురాలు గుడిసె ఆదిలక్ష్మమ్మ, ఎమ్మెల్యే బి.వి. జయనాగేశ్వరరెడ్డి, బీజేపీ ఇన్‌చార్జి విట్టా రమేష్, ప్రజాప్రతినిధులు, అధికారులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీని రైతులతో అనుసంధానం చేయాలి: వీస్ విజయ్ వర్మ పాకలపాటి

**అలీగఢ్,మన జనప్రగతి జూలై 25:** –గ్రామ పంచాయతీలకు ఆర్థిక, పరిపాలనా స్వయం ప్రతిపత్తి కల్పించి గ్రామ స్వరాజ్యాన్ని బలోపేతం చేయాలని ఆల్ ఇండియా పంచాయత్ పరిషత్ 19వ జాతీయ సదస్సు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేసింది. జాతీయ గ్రామీణ స్థితిగతుల కమిటీ ఛైర్మన్ వీస్ విజయ్ వర్మ పాకలపాటి మాట్లాడుతూ, నిధుల కొరతతో గ్రామ పంచాయతీలు అభివృద్ధి పనులు చేపట్టలేకపోతున్నాయని తెలిపారు. గ్రామాల్లో మద్య నియంత్రణను కఠినంగా అమలు చేయాలని, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని రైతులతో అనుసంధానం చేసి వ్యవసాయ పనులకు ఉపయోగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సదస్సులో గ్రామీణాభివృద్ధి, స్థానిక సంస్థలకు అధిక అధికారాలు, సకాలంలో నిధుల విడుదల, గ్రామ స్వరాజ్యం బలోపేతానికి సంబంధించిన పలు తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. తెలుగు రాష్ట్రాల నుంచి పలువురు ప్రజాప్రతినిధులు, పంచాయత్ పరిషత్ నాయకులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.




# ఆలూరు నియోజకవర్గం ఆస్పరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన ముఖ్యమంత్రి చంద్రబాబు

**కర్నూలు బ్యూరో/ఆస్పరి మన జనప్రగతి జూలై 25:**–ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సంజీవని ప్రాజెక్టు అమలు తీరును ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శనివారం పరిశీలించారు.


ప్రిడిక్టివ్, ప్రివెంటివ్, క్యూరేటివ్ విధానంలో భాగంగా సంజీవని ప్రాజెక్టు అమలు పై వైద్యుల నుంచి సీఎం వివరాలు తెలుసుకున్నారు. డిజిటల్‌గా వ్యక్తిగత ఆరోగ్య రికార్డులను అనుసంధానించి ఆరోగ్య సంరక్షణ అందించే విధానాన్ని ముఖ్యమంత్రి పరిశీలించారు. డిజిటల్ సాంకేతికతతో సమాచారం, ఫాలోఅప్, వ్యాధుల గుర్తింపు, కౌన్సెలింగ్, కుటుంబ సభ్యుల భాగస్వామ్యం లాంటి అంశాలపై సీఎం ఆరా తీశారు. సంజీవనికి ముందు అమలు తర్వాత వచ్చిన మార్పుల గురించి ముఖ్యమంత్రి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. స్పెషలిస్ట్ వైద్యుల సాయంతో వి- పాడ్ వ్యవస్థ ద్వారా హై రిస్క్ ప్రసవాన్ని పీహెచ్ సీ నుంచి విజయవంతంగా చేసినట్టు వైద్యాధికారులు సీఎంకు వివరించారు. సకాలంలో నిర్ణయం తీసుకుని ఓ గర్భిణికి విజయవంతంగా ప్రసవం చేయడంపై వైద్యులను ముఖ్యమంత్రి అభినందించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కొందరు దంపతులతో ముఖ్యమంత్రిమాట్లాడారు. వారి పిల్లలను ఆప్యాయంగా ఎత్తుకుని మహిళల ఆరోగ్య సంరక్షణ పై పీహెచ్ సీలో అందుతున్న సేవల గురించి ముఖ్యమంత్రి అడిగి తెలుసుకున్నారు. గర్భధారణ సమయంలో తమకు అందిన వైద్య సేవలు,హెల్త్ ఫాలోఅప్ గురించి సీఎంకు మహిళలువివరించారు. ఆరోగ్య సంరక్షణలో వ్యాధుల ట్రాకింగ్,వైద్య పరీక్షల రిమైండర్లు, హెల్త్ రిపోర్టుల గురించి సీఎంకు వివరించిన అధికారులు సంజీవని ప్రాజెక్టును పటిష్టంగా అమలు చేసి ప్రజల ఆరోగ్యాన్ని సంరక్షిస్తామని ముఖ్యమంత్రి స్పష్టం చేసారు.




# ఘనంగా తొలి ఏకాదశి వేడుకలు

**- ఉత్తర ద్వార దర్శనానికి పోటెత్తిన భక్తులు.!**

**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి జూలై 25:–** కమలాపురం మండలంలోని శ్రీ రామాపురం మహా పుణ్యక్షేత్రంలో తొలి ఏకాదశి వేడుకలు శనివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ చైర్మన్ సాయినాథ్ శర్మ సమక్షంలో జరిగిన ఈ వేడుకల్లో ఉత్తర ద్వార దర్శనాన్ని ఏర్పాటు చేయగా, ఉదయం నుంచే భక్తులు భారీ సంఖ్యలో ఆలయానికి తరలివచ్చి శ్రీ మహాలక్ష్మి సమేత మోక్షనారాయణ స్వామి, శ్రీ వల్లి దేవసేన సమేత షణ్ముఖ సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారిని భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రధాన దేవతామూర్తులకు ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, విశేష పూజలు నిర్వహించారు. అనంతరం వేద మంత్రోచ్చారణల నడుమ స్వామివారి కళ్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉత్తర ద్వారం ద్వారా స్వామివారిని దర్శించుకోవడం వల్ల విశేష పుణ్యఫలం లభిస్తుందనే విశ్వాసంతో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ చైర్మన్ సాయినాథ్ శర్మ మాట్లాడుతూ, ప్రతి నెల ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వార దర్శనాన్ని ఏర్పాటు చేస్తున్నామని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందడం ఆనందదాయకమని తెలిపారు. కార్యక్రమం అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ అధికారులు, అర్చకులు, సేవకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.



## ఆగస్టు 6న టీటీడీ మిక్సిడ్ రైస్ ఈ - వేలం



**తిరుమల మన జనప్రగతి జూలై 25:** తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామివారి ఆలయంతో పాటు టీటీడీ అనుబంధ ఆలయాల్లో భక్తులు హుండీల ద్వారా సమర్పించిన బియ్యాన్ని ఆగస్టు 6న ఈవేలం ద్వారా విక్రయించనున్నట్లు టీటీడీ తెలిపింది.ఈ వేలంలో మొత్తం 20 లాట్లలో సుమారు 7,938 కిలోల మిక్సిడ్ రైస్ అందుబాటులో ఉంచనున్నారు.వేలంలో పాల్గొనదలచిన ఆసక్తి గల వారు ఆగస్టు 5 సాయంత్రం లోపు Konugolu పోర్టల్ ద్వారా రూ.50,000 ఈఎండీ ఆన్‌లైన్‌లో చెల్లించాల్సి ఉంటుంది.మరిన్ని వివరాలకు తిరుపతిలోని టీటీడీ మార్కెటింగ్ కార్యాలయాన్ని కార్యాలయ వేళల్లో సంప్రదించవచ్చు. ఫోన్:0877-2264429. అలాగే www.konugolu.ap.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చు.

## ఉపాధి హామీ పథకం ద్వారా రైతులకు చేయూత

**- ప్రాజెక్టు డైరెక్టర్,ఆదిశేషారెడ్డి**



**చెన్నూరు మన జనప్రగతి జులై 25:-** ఉపాధి హామీ పథకం ద్వారా రైతులకు ఈ వ్యవసాయ పొలాల్లో పంట కాలవలు పూడిక తీయడంతో పాటు రైతులకు కావలసిన పండ్ల మొక్కలు అనేక విధాలుగా రైతులకు చేయూత నిస్తున్నదిని జిల్లా ఉపాధి హామీ పథకం ప్రాజెక్ట్ డైరెక్టర్ ఆదిశేషారెడ్డి పేర్కొన్నారు, చెన్నూరు మండలం కొండపేట గ్రామంలో కొండారెడ్డి కి చెందిన రెండున్నర ఎకరా వ్యవసాయ పొలంలో బండ్ ప్లాంటేషన్ కింద చుట్టూ 150 కొబ్బరి మొక్కలు మంజూరు కాగా శనివారం ఉదయం రైతు కొండారెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి పిడి ఆదిశేష రెడ్డి కొబ్బరి మొక్కలు నాటారు, ఆదిశేషారెడ్డి మాట్లాడుతూ రైతులు కొబ్బరి చెట్లు చుట్టూ నాటడం వలన రైతులు సాగు చేసే పంట పొలాలకు రక్షణగా ఉంటుందని ఆయన సూచించారు, పిడి వెంట ఏపీవో శైలజ, టెక్నికల్ అసిస్టెంట్ రెడ్డయ్య, ప్లాంట్ సూపర్వైజర్ సదా, ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్, ఉపాధి హామీ పథకం కూలీలు రైతులు పాల్గొన్నారు,

## నేడు (26న) శ్రీ ప్రగడ కోటయ్య జయంతి రాష్ట్ర వేడుకలు

**కడప,టౌన్ మన జనప్రగతి జూలై 25: -** రాష్ట్ర ప్రభుత్వం అధికారిక రాష్ట్ర వేడుకగా నిర్వహిస్తున్న శ్రీ ప్రగడ కోటయ్య జయంతి కార్యక్రమాన్ని ఆదివారం (26న) ఉదయం 10 గంటలకు కడప కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో నిర్వహించనున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి కోసిగి మల్లికార్జునుడు ఒక ప్రకటనలో తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులతో పాటు ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు, నేత కార్మికులు, ప్రజలు హాజరుకావాలని ఆయన కోరారు. అందరూ ఆహ్వానితులేనని, ఆసక్తి గల ప్రతి ఒక్కరూ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని డీఆర్వో మల్లికార్జునుడు పేర్కొన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతమే ప్రభుత్వ లక్ష్యం: మంత్రి కందుల దుర్గేష్

**నిడదవోలు,మన జనప్రగతి జూలై 25:-** అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేసి చిన్నారులకు పోషకాహారం, నాణ్యమైన ప్రాథమిక విద్య అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు.నిడదవోలులో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన నియోజకవర్గంలోని 211 అంగన్‌వాడీ కేంద్రాలకు ఇండక్షన్ స్టవ్‌లు, వంట సామగ్రితో కూడిన కిచెన్ కిట్లు పంపిణీ చేశారు. అలాగే అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు నూతన యూనిఫామ్‌లు అందజేశారు. అంగన్‌వాడీ కార్యకర్తల శ్రమ తగ్గించడంతో పాటు వంట ప్రక్రియను సులభతరం చేసేందుకు ఈ కిట్లు ఉపయోగపడతాయని మంత్రి తెలిపారు. చిన్నారులకు పౌష్టికాహారం, మెరుగైన విద్య అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని చెప్పారు. విద్య, వైద్య రంగాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి దుర్గేష్ పేర్కొన్నారు.

## దాససాహిత్య గాయకులకు టీటీడీ నుంచి సువర్ణావకాశం

**● ఆగస్టు 1 నుంచి 20 వరకు దరఖాస్తుల స్వీకరణ**



**తిరుమల మన జనప్రగతి జూలై 25:-** తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో ప్రతిరోజూ నిర్వహించే శ్రీవారి సహస్ర దీపాలంకార సేవ, అలాగే తిరుపతి శ్రీ గోవిందరాజస్వామివారి ఆలయంలో నిర్వహించే దాససాహిత్య సంకీర్తనలను ఆలపించేందుకు ప్రతిభావంతులైన, అర్హులైన సంగీత కళాకారుల నుంచి టీటీడీ ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను ఆహ్వానిస్తోంది.ఈ ఆడిషన్లు 2026 నవంబరు 27 నుంచి డిసెంబరు 2వ తేదీ వరకు ఆరు రోజులపాటు తిరుపతిలోని మహతి ఆడిటోరియంలో నిర్వహించబడనున్నాయి.ఆసక్తి గల అభ్యర్థులు 2026 ఆగస్టు 1 నుంచి 20వ తేదీ వరకు మాత్రమే https://apps.tirumala.org/dsp/ ద్వారా ఆన్‌లైన్‌లో తమ దరఖాస్తులను సమర్పించాలి.అభ్యర్థుల అర్హతలు, ఆడిషన్ విధానం, సమర్పించాల్సిన ధ్రువపత్రాలు, మార్గదర్శకాలు, ఇతర నిబంధనలకు సంబంధించిన పూర్తి వివరాలు టీటీడీ అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని అధికారులు తెలిపారు.ఈ ఆడిషన్ ప్రక్రియలో టీటీడీ ఎటువంటి ఏజెంట్లు, మధ్యవర్తులు లేదా ప్రతినిధులను నియమించలేదని స్పష్టం చేసింది. అభ్యర్థులు అనధికార వ్యక్తులను నమ్మకుండా, అధికారిక ఆన్‌లైన్ పోర్టల్ ద్వారానే దరఖాస్తులు సమర్పించాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది.

## షాది ఖానా భవనాన్ని త్వరలో అందుబాటులోకి తీసుకువస్తాం



**చిట్వేల్లి మన జనప్రగతి జూలై 25:-** చిట్వేలి పట్టణంలోని ఆర్ & బీ బంగ్లా ఆవరణంలో అసంపూర్తిగా ఉన్న షాదీఖానా భవనాన్ని త్వరలోనే పూర్తిచేసి ముస్లిం ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడానికి కృషి చేస్తామని రైల్వే కోడూరు శాసనసభ్యులు అరవ శ్రీధర్,రైల్వే కోడూరు నియోజకవర్గం టీడీపీ నాయకురాలు ముక్కా వరలక్ష్మి హామీ ఇచ్చారు.శనివారం చిట్వేలి గ్రామం ప్రజలతో కలిసి షాదీఖానా భవనాన్ని పరిశీలించారు.అనంతరం ఎమ్మెల్యే అరవ శ్రీధర్ మాట్లాడుతూ చిట్వేలి ముస్లిం ప్రజలకు ఎంతో అవసరమైన ఈ షాదీఖానా భవనం ఎన్నో సంవత్సరాలుగా అసంపూర్తిగా ఉండిపోవడం బాధాకరమన్నారు. ఈ భవన నిర్మాణాన్ని పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడానికి తమ వంతు కృషి చేస్తామని, సంబంధిత అధికారులతో మాట్లాడి అవసరమైన చర్యలు తీసుకునేలా ప్రయత్నిస్తామని తెలిపారు.ముక్కా వరలక్ష్మి మాట్లాడుతూ ముస్లిం ప్రజలు ఎంతోకాలంగా ఈ షాదీఖానా పూర్తికావాలని ఎదురుచూస్తున్నారని అన్నారు.స్థానికుల ఆకాంక్షలకు అనుగుణంగా భవన నిర్మాణాన్ని పూర్తిచేసి ప్రజలకు ఉపయోగపడేలా చేయడానికి నిరంతరం కృషి చేస్తామని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

## వైఎస్ఆర్ కడప జిల్లాలో పంటల బీమా నమోదు గడువు పొడిగింపు

**కడప,మన జనప్రగతి జూలై 25 :-** జిల్లాలో వాతావరణ ఆధారిత పంటల బీమా పథకం (ఆర్‌డబ్ల్యూబీసీఐఎస్) కింద వేరుశెనగ, పత్తి, బత్తాయి, అరటి పంటలకు బీమా నమోదు గడువును ఈ నెల 31వ తేదీ వరకు పొడిగించినట్లు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సుబ్రహ్మణ్యేశ్వర రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పొడిగింపు రుణగ్రహీత (లోనీ), రుణేతర (నాన్-లోనీ) రైతులందరికీ వర్తిస్తుందని పేర్కొన్నారు. ఎన్‌సీఐపీ పోర్టల్‌లో పెండింగ్‌లో ఉన్న పంటల బీమా నమోదును రైతులు తప్పనిసరిగా జూలై 31లోపు పూర్తి చేయాలని ఆయన సూచించారు. గడువు ముగిసిన తర్వాత బీమా నమోదు చేసుకునే అవకాశం ఉండదని స్పష్టం చేశారు. జూలై 31లోపు నమోదు పూర్తి చేసుకున్న రైతులకు ఆగస్టు 1 నుంచి పంట బీమా రక్షణ అమలులోకి వస్తుందని వెల్లడించారు.ప్రకృతి వైపరీత్యాల వల్ల పంటలకు నష్టం వాటిల్లిన సమయంలో బీమా రైతులకు ఆర్థిక భరోసా కల్పిస్తుందని పేర్కొన్న సుబ్రహ్మణ్యేశ్వర రావు, జిల్లాలోని అర్హులైన రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని గడువు ముగిసేలోపు పంటల బీమా నమోదు పూర్తి చేసుకోవాలని కోరారు

## ఎర్రకాలువ ముంపు సమస్యకు పరిష్కారం దిశగా కీలక అడుగు: మంత్రి కందుల దుర్గేష్




**నిడదవోలు,మన జనప్రగతి జూలై 25: -** నిడదవోలు నియోజకవర్గంలో ఎర్రకాలువ ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. సింగవరం వద్ద రూ.51 లక్షలతో ఏర్పాటు చేసిన ఫ్లాప్ షట్టర్లను ఆయన శనివారం పరిశీలించారు.ఈ షట్టర్ల వల్ల సింగవరం, తాళ్లపాలెం, శెట్టిపేట ప్రాంతాల్లోని సుమారు 2,400 ఎకరాల ఆయకట్టుకు వరద ముప్పు తగ్గి, పంటలు రక్షణ పొందనున్నాయని తెలిపారు. గతంలో షట్టర్లు లేక ప్రతి వర్షాకాలంలో వేల ఎకరాల పంటలు దెబ్బతినేవని చెప్పారు.ఎర్రకాలువ సమస్యకు రూ.295 కోట్లతో శాశ్వత పరిష్కార ప్రతిపాదనను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లామని, అలాగే రూ.1.8 కోట్లతో కాలువ గట్లు బలోపేతం, గండ్ల పూడ్చివేత పనులు కొనసాగుతున్నాయని వెల్లడించారు.మంత్రి ప్రత్యేక చొరవతో తమ సమస్యకు పరిష్కారం లభించిందని స్థానిక రైతులు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మంత్రి దుర్గేష్ పేర్కొన్నారు.

## రామనపల్లె విద్యార్థులకు స్కౌట్ తృతీయ సోపానం, జాతీయ క్రీడాకారులకు ధ్రువపత్రాల ప్రదానం



**చెన్నూరు మన జనప్రగతి జూలై 25:-** భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో చెన్నూరు మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, రామనపల్లెలో నిర్వహించిన మెగా తల్లిదండ్రుల సమావేశం సందర్భంగా శనివారం స్కౌట్ తృతీయ సోపానం పూర్తి చేసిన విద్యార్థులకు, జాతీయ స్థాయి క్రీడల్లో పాల్గొన్న విద్యార్థులకు ధ్రువపత్రాలను అందజేశారు.ఈ కార్యక్రమంలో ఛత్రపతి శివాజీ స్కౌట్ దళం నాయకుడు ప్రొద్దుటూరు బాబయ్య, సుభాష్ చంద్రబోస్ స్కౌట్ దళం నాయకుడు పోలంకి గణేష్ బాబు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఉమామహేశ్వరి దేవి, స్కౌట్స్ తల్లిదండ్రులు పాల్గొన్నారు.స్కౌట్ తృతీయ సోపానం పూర్తి చేసిన సాయి కార్తీక్, కమల్ బాషా, నవనీశ్వర్, వెంకట భరత్‌లకు ధ్రువపత్రాలు అందజేశారు. చెన్నూరు మండలంలో తొలిసారిగా స్కౌట్ తృతీయ సోపానంలో శిక్షణ పూర్తి చేసి ధ్రువపత్రాలు పొందిన విద్యార్థులు వీరే కావడం విశేషమని నిర్వాహకులు తెలిపారు.అలాగే పాఠశాల శారీరక విద్యా ఉపాధ్యాయుడు పోలంకి గణేష్ బాబు అందించిన శిక్షణతో జాతీయ స్థాయి క్రీడా పోటీలకు ఎంపికై పాల్గొన్న విద్యార్థులను సైతం ఈ సందర్భంగా అభినందించి, వారి తల్లిదండ్రుల చేతుల మీదుగా ధ్రువపత్రాలను అందజేశారు.జాతీయ స్థాయి పోటీల్లో ఢిల్లీలో నిర్వహించిన రగ్బీ పోటీల్లో దుర్గాప్రసాద్, నందిని, మహారాష్ట్రలో జరిగిన నెట్‌బాల్ పోటీల్లో మోక్షిత, పంజాబ్‌లో నిర్వహించిన గత్కా క్రీడా పోటీల్లో నాగచైతన్య పాల్గొని పాఠశాలకు గుర్తింపు తీసుకువచ్చారు.ఈ సందర్భంగా విద్యార్థుల విజయాలను అభినందించిన ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు.

## తిరుమల పాదయాత్రకు సంఘీభావం తెలిపిన పుత్తా రామచంద్రయ్య



**భాకరాపేట మన జనప్రగతి జూలై 25:-** కమలాపురం పెద్దచెప్పలి ఎల్లమ్మ తల్లి దేవస్థానం నుంచి తిరుమల శ్రీవారి దర్శనార్థం పాదయాత్రగా బయలుదేరిన టీడీపీ రాష్ట్ర మాజీ కార్యదర్శి, చెప్పలి ఎల్లమ్మ తల్లి దేవస్థానం మాజీ చైర్మన్ శీలం ప్రభాకర్ రెడ్డికి భాకరాపేట సమీపంలో టీడీపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రాజంపేట పార్లమెంట్ టీడీపీ మాజీ ఉపాధ్యక్షులు పుత్తా రామచంద్రయ్య, పుత్తా సోదరులు, నియోజకవర్గ టీడీపీ అధికార ప్రతినిధి కడితం రామమోహన్ నాయుడు ఆధ్వర్యంలో శీలం ప్రభాకర్ రెడ్డికి శాలువా కప్పి సత్కరించారు. పాదయాత్ర విజయవంతంగా కొనసాగాలని ఆకాంక్షిస్తూ, పాదయాత్రలో పాల్గొన్న భక్తులకు శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర ప్రజలందరికీ శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆశీస్సులు లభించాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో పుత్తా బాలయ్య, పుత్తా ఎల్లయ్య, పుత్తా గణపతి, మోతకట్ల నరసింహారెడ్డి, సిద్ధవటం టీడీపీ మాజీ యూనిట్ ఇన్‌చార్జి పుత్తా శివానందతో పాటు పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

## జ్యోతి సిద్ధేశ్వర ఆలయాన్ని అభివృద్ధి చేస్తాం

**- శ్రీశైలం దేవస్థానం చైర్మన్ పోతుగుంట రమేష్ నాయుడు**



**సిద్ధవటం మన జనప్రగతి జూలై 25:-** శ్రీశైల దక్షిణ ముఖద్వారంగా ప్రసిద్ధి చెందిన సిద్ధవటం మండలం జ్యోతి గ్రామంలోని శ్రీ జ్యోతి సిద్ధేశ్వర స్వామి ఆలయాన్ని సమగ్రంగా అభివృద్ధి చేస్తామని శ్రీశైలం దేవస్థానం పాలకమండలి చైర్మన్ పోతుగుంట రమేష్ నాయుడు తెలిపారు. శనివారం ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆలయ విశిష్టతపై అధికారులను, అర్చకులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జ్యోతి సిద్ధేశ్వర క్షేత్రానికి పూర్వ వైభవం తీసుకురావడానికి త్వరలో శ్రీశైలం దేవస్థానం పాలకమండలి సమావేశంలో ఆలయ అభివృద్ధిపై ప్రత్యేక తీర్మానం చేయనున్నట్లు వెల్లడించారు. పెన్నా నది తీరంలో ఉన్న ఈ ప్రాచీన పుణ్యక్షేత్రం, సిద్ధవటం ప్రాంతంలోని చారిత్రక కట్టడాలు, శిల్ప సంపద రాష్ట్రానికి ప్రత్యేక గుర్తింపుగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఆలయ అభివృద్ధికి గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు, భక్తులు సహకరించాలని పిలుపునిచ్చారు. అనంతరం టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మోహన్ రెడ్డి చైర్మన్ రమేష్ నాయుడిని శాలువాతో సత్కరించి స్వామివారి ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయ్ కుమార్, ఆలయ ఈవో మురళి, బీజేపీ, టీడీపీ నాయకులు, ఆలయ అర్చకులు, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ ఆధ్వర్యంలో నేత్రదానం: లయన్ హరినాద్ రెడ్డి




**అన్నమయ్య జిల్లా బ్యూరో మన జనప్రగతి జులై 25:-** స్థానిక గాంధీ బజార్ నందు తిరుమల చైతన్యకుమార్ నేత్ర దానం చేయడం జరిగిందని లయన్స్ ఆర్గాన్ డొనేషన్ చైర్మన్ లయన్ కొత్త సుదర్శన్ తెలియజేశారు.అనంతరం తిరుమల సత్యం మాట్లాడుతూ మా కుమారుడు తిరుమల చైతన్యకుమార్ ఉదయం యాక్సిడెంట్ లో చనిపోవడం జరిగిందని చనిపోయిన మరో ఇద్దరికి సహాయ పడాలని ఉద్దేశంతో మా అబ్బాయి నేత్రాలు కడప ఎల్వి ప్రసాద్ హాస్పిటల్ వారికి అందించడం జరిగిందని ఇలాంటి కార్యక్రమాలు ప్రతి ఒక్కరు చేయాలని తెలియజేశారు.అనంతరం తిరుమల ఆశాజ్యోతి మరియుకుటుంబ సభ్యులు మాట్లాడుతూ మానవుడు చనిపోయిన తర్వాత కూడా ఇతరులకు ఎన్నో విధాలుగా ఉపయోగపడవచ్చని ఆ భాగముగా మా ఇంట్లో శనివారం నేత్రదానం చేయడం జరిగిందని తెలియజేశారు అనంతరం వీరభద్ర స్వామి టెంపుల్ చైర్మన్ తిరుమల మనోజ్ కుమార్ లయన్స్ వ్యవస్థాపక అధ్యక్షుడు పివిస్ హరినాధ రెడ్డి మాట్లాడుతూ ఇప్పటివరకు రాయచోటి పట్టణం నుండి దాదాపు 36మంది నేత్రదానాలు చేయడం జరిగిందని రాబోయే రోజుల్లో మీ పరిసర ప్రాంతాల్లో ఇలాంటి జరిగినప్పుడు మాకు తెలియజేసిన మేము అక్కడికి వస్తాము మా ఫోన్ నెంబర్లు 9701078269 .9848366706 అలాగే ఫోన్ చేసి సహగాలని అందించాలని తెలియజేశారు ఈ కార్యక్రమంలో కడప ఎల్వి ప్రసాద్ ఐ బ్యాంక్ టెక్నీషియన్ కే.ప్రశాంత్ కుమార్ తిరుమల రంజిత్ పాల్గొన్నారు

మన జన ప్రగతి

26- 07 - 2026

# కార్గిల్ విజయ దినోత్సవ వేడుకలు

## • గౌతమ్,రవిచంద్ర విద్యాసంస్థల్లో

## ఘనంగా కార్గిల్ విజయ దినోత్సవం







**గాలివీడు మన జనప్రగతి జూలై 25:–** అన్నమయ్య జిల్లా గాలివీడు మండలంలోని గౌతమ్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల మరియు రవిచంద్ర ఇంగ్లీష్ మీడియం స్కూల్ అండ్ కాలేజ్లో శనివారం కార్గిల్ విజయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సోల్జర్ రాజశేఖర్ హాజరై కార్గిల్ యుద్ధం విశిష్టతను విద్యార్థులకు వివరించారు. 1999 మే 3న ప్రారంభమైన కార్గిల్ యుద్ధం లడఖ్‌లోని కార్గిల్ జిల్లాలో భారతదేశంపాకిస్థాన్ మధ్య 85 రోజుల పాటు కొనసాగిందని తెలిపారు. ఎత్తైన పర్వత ప్రాంతాల్లో జరిగిన ఈ సంఘర్షణలో భారత సైన్యం అపూర్వమైన ధైర్యసాహసాలతో శత్రువుల చెరలోకి వెళ్లిన కీలక శిఖరాలను తిరిగి స్వాధీనం చేసుకుని చారిత్రాత్మక విజయాన్ని సాధించిందని చెప్పారు. 1999 జూలై 26న సాధించిన ఆ విజయానికి గుర్తుగా ప్రతి ఏడాది కార్గిల్ విజయ దినోత్సవాన్ని నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు. దేశ రక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన అమర జవాన్ల సేవలను ప్రతి భారతీయుడు చిరకాలం గుర్తుంచుకోవాలని ఆయన ఆదేశించారు. ఈ సందర్భంగా పాఠశాలల డైరెక్టర్లు సైజు థామస్ మరియు షింటో ఇమాన్యుల్ మాట్లాడుతూ దేశభక్తి, క్రమశిక్షణ, సేవాభావం వంటి విలువలను విద్యార్థులు అలవరచుకోవాలని సూచించారు. కార్గిల్ వీరుల త్యాగాలు ప్రతి విద్యార్థికి స్ఫూర్తిదాయకమని, దేశం పట్ల బాధ్యతతో ముందుకు సాగాలని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం అమర జవాన్లకు నివాళులర్పించి, దేశభక్తి గీతాలు, ప్రసంగాలతో కార్యక్రమాన్ని ముగించారు. ఈ కార్యక్రమంలో గౌతమ్ మరియు రవిచంద్ర విద్యాసంస్థల ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కార్గిల్ అమరవీరులకు ఘన నివాళి

## • కేఎల్ఎం మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో

## కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా కార్యక్రమం




**కడప మన జనప్రగతి జూలై 25:–** కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా దేశం కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరులకు కడపలోని కేఎల్ఎం మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం విద్యార్థినులు ఘన నివాళులు అర్పించారు. 1999 జూలై 26న కార్గిల్ యుద్ధంలో భారత్ సాధించిన విజయాన్ని స్మరించుకుంటూ నిర్వహించిన ఈ కార్యక్రమంలో అమర జవాన్ల సేవలను గుర్తుచేసి రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎం.వి. రత్నమ్మ మాట్లాడుతూ దేశ రక్షణ కోసం ప్రాణాలను అర్పించిన సైనికుల త్యాగం చిరస్మరణీయమని, వారి స్ఫూర్తిని ప్రతి విద్యార్థి ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. జాన్ దేవానంద్ మాట్లాడుతూ అత్యంత ప్రతికూల పరిస్థితుల్లోనూ భారత సైన్యం అపూర్వ ధైర్యసాహసాలు ప్రదర్శించి పాకిస్తాన్‌కు దీటైన సమాధానం ఇచ్చిందని పేర్కొన్నారు. మహేష్ నాయక్ మాట్లాడుతూ కార్గిల్ విజయం దేశ ప్రజల్లో దేశభక్తిని మరింత పెంపొందించిందన్నారు. రమణ మాట్లాడుతూ అప్పటి ప్రధాని అటల్ బిహారీ వాజపేయి నాయకత్వం, భారత సైన్యం చూపిన పరాక్రమం దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయాయని చెప్పారు. అమీనుల్లా మాట్లాడుతూ దేశం కోసం అమరులైన జవాన్ల సేవలు వెలకట్టలేనివని అన్నారు. శ్రీనివాసులు మాట్లాడుతూ కార్గిల్ విజయం భారత సైన్యం సాహసానికి నిదర్శనమని కొనియాడారు. ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త యోనాథన్ మాట్లాడుతూ కార్గిల్ యుద్ధంలో భారత సైన్యం ప్రదర్శించిన ధైర్యసాహసాలు దేశ ప్రజలకు శాశ్వత స్ఫూర్తిగా నిలుస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమం అనంతరం కళాశాల కరస్పాండెంట్ శ్రీమతి కె. రాజేశ్వరి, మేనేజింగ్ డైరెక్టర్ డా. కె. చంద్ర ఓబుల్ రెడ్డి, స్పెషల్ ఆఫీసర్ ఎస్. శివకృష్ణారెడ్డి విద్యార్థినుల్లో దేశభక్తి భావం మరింత పెంపొందాలని ఆకాంక్షిస్తూ, కార్యక్రమాన్ని విజయవంతం చేసిన విద్యార్థినులు, అధ్యాపకులను అభినందించారు.

# తొలి ఏకాదశి సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు





**చెన్నూరు మన జనప్రగతి జూలై 25:** తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని చెన్నూరు మండలంలోని పలు దేవాలయాల్లో శనివారం ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. స్థానిక ట్రంకు రోడ్డు పక్కన ఉన్న శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి (కోట్ల స్వామి) ఆలయంలో తెల్లవారుజామున నుంచే అభిషేకాలు, అలంకరణలు, ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులకు ప్రత్యేక క్యూలైన్ ద్వారా స్వామివారి దర్శనం కల్పించగా, పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయంలో భజనలు, హరినామ సంకీర్తనలు నిర్వహించగా, ఆలయ ప్రాంగణాన్ని విద్యుత్ దీపాలు, పూలతో అందంగా అలంకరించారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. అదేవిధంగా అమ్మవారి ఆలయం, ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయాల్లోనూ ప్రత్యేక పూజలు జరిగాయి. తొలి ఏకాదశి సందర్భంగా చెన్నూరులోని శివాలయాలు, రామాలయాలు, అమ్మవారి దేవాలయాల్లో భక్తులు విశేషంగా పాల్గొన్నారు. అలాగే శివాలపల్లి సమీపంలోని శ్రీ వీరభద్ర లక్ష్మీనరసింహస్వామి ఆలయం, పుష్పగిరి మార్గంలోని కాశీశ్వరాలయంలోనూ ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

# సబ్‌స్టేషన్ పనులకు గ్రీన్ సిగ్నల్..ఎమ్మెల్యే ధర్నా విరమణ..!



**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి జూలై 25:–** ప్రొద్దుటూరులోని శ్రీనివాసనగర్‌లో 33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులకు గ్రీన్ సిగ్నల్ లభించడంతో ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి ప్రతిపాదించిన ధర్నా కార్యక్రమాన్ని విరమించారు. శనివారం ఆర్ అండ్ బి అతిథి గృహంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. శ్రీనివాసనగర్ ప్రాంతంలో లో–వోల్టేజ్ సమస్యకు శాశ్వత పరిష్కారంగా గత టీడీపీ ప్రభుత్వ హయాంలో 33 కేవీ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేపట్టినప్పటికీ, భూమి వివాదం కారణంగా పనులు నిలిచిపోయాయని ఎమ్మెల్యే తెలిపారు. తాజాగా కోర్టు తీర్పుతో 2.49 ఎకరాల భూమి ప్రభుత్వ భూమిగా నిర్ధారణ కావడంతో నిర్మాణ పనులకు మార్గం సుగమమైందన్నారు. జిల్లా కలెక్టర్‌తో పాటు సంబంధిత అధికారులు సోమవారం నుంచే పనులు ప్రారంభిస్తామని హామీ ఇవ్వడంతో ప్రజల ప్రయోజనాల దృష్ట్యా ధర్నా నిర్ణయాన్ని విరమించుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సహకరించిన జిల్లా యంత్రాంగానికి, రాష్ట్ర ప్రభుత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. విద్యుత్ శాఖ ఈఈ చాంద్ బాష మాట్లాడుతూ, సబ్‌స్టేషన్ నిర్మాణంలో మిగిలిన 20 శాతం పనులను వేగంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని చెప్పారు. అవసరమైన అనుమతులు పూర్తికాగానే పరికరాలను తరలించి పనులు ప్రారంభిస్తామని తెలిపారు. విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, రాష్ట్ర టీడీపీ ప్రధాన కార్యదర్శి డా.వి.ఎస్.ముక్తియార్, తోట మహేశ్వర రెడ్డి, ఈవీ సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తమ సేవలతోనే గుర్తింపు పదోన్నతిపై వెళ్లిన సేవా సిబ్బందికి ఘన సత్కారం




**అన్నమయ్య జిల్లా బ్యూరో మన జనప్రగతి జూలై 25:–** ఉద్యోగులు తమ విధి నిర్వహణలో నిబద్ధతతో, ఉత్తమ సేవలు అందించినప్పుడే వారికి తగిన గుర్తింపు లభిస్తుందని డైట్ ఇన్‌చార్జి ప్రిన్సిపల్ మడితాటి నరసింహారెడ్డి పేర్కొన్నారు. రాయచోటి డైట్‌లో జూనియర్ అసిస్టెంట్లుగా విధులు నిర్వహిస్తూ సీనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతి పొందిన డేవిడ్ దీపక్ కడపలోని టెక్స్ట్‌బుక్ విభాగానికి, రవికుమార్ మదనపల్లెలోని సమగ్ర శిక్ష కార్యాలయానికి బదిలీపై వెళ్తున్న సందర్భంగా శనివారం డైట్‌లో ఘనంగా వీడ్కోలు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మడితాటి నరసింహారెడ్డి మాట్లాడుతూ, విద్యాసంస్థల పరిపాలనలో క్లరికల్ సిబ్బంది సేవలు అత్యంత కీలకమని అన్నారు. ప్రభుత్వ కార్యాలయాలన్నీ డిజిటల్, ఆన్‌లైన్ విధానంలో పనిచేస్తున్న ప్రస్తుత పరిస్థితుల్లో సాంకేతిక పరిజ్ఞానాన్ని ఎప్పటికప్పుడు పెంపొందించుకొని మరింత సమర్థవంతంగా సేవలందించాలని సూచించారు. పదోన్నతి పొందిన ఇద్దరు ఉద్యోగులు తమ కొత్త బాధ్యతల్లోనూ సమర్థవంతంగా పనిచేసి మరిన్ని ఉన్నత స్థానాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. అనంతరం డేవిడ్ దీపక్, రవికుమార్‌లను దుశ్శాలువులతో, పూలమాలలు వేసి, జ్ఞాపికలు అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డైట్ అధ్యాపకులు, కార్యాలయ సిబ్బంది పాల్గొని పదోన్నతి పొందిన ఉద్యోగులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

# తొలి ఏకాదశికి ఒంటిమిట్ట రామాలయంలో భక్తుల రద్దీ

### - సీతారాముల దర్శనం అనంతరం తీర్థప్రసాదాలు, ఉచిత అన్నప్రసాదం స్వీకరించిన భక్తులు



**ఒంటిమిట్ట మన జనప్రగతి జూలై 25:–** తొలి ఏకాదశి సందర్భంగా ప్రముఖ పుణ్యక్షేత్రమైన ఒంటిమిట్ట శ్రీ కోదండరామాలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. తొలి ఏకాదశి, శనివారం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు ఏకశిలా నగరానికి తరలివచ్చి శ్రీ సీతారామచంద్రస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అధికారులు అందజేసిన తీర్థప్రసాదాలు స్వీకరించిన భక్తులు, దేవస్థానం ఏర్పాటు చేసిన ఉచిత అన్నప్రసాదాన్ని ఆరగించి తమ భక్తిశ్రద్ధలను చాటుకున్నారు. ఆలయ ప్రాంగణం రోజంతా భక్తుల రాకపోకలతో సందడిగా కనిపించింది.

# దానిమ్మ పంట సాగులో మెలుకువలు

### - దానిమ్మ తోటలు సందర్శించిన జిల్లా ఉద్యాన అధికారి:హరి ప్రసాద్



**తొండూరు మన జనప్రగతి జూలై 25:–** మండల పరిధిలోని మల్లెల గ్రామ పొలంలో దానిమ్మ తోటలో గత మూడు సంవత్సరాల నుంచి ధరలు స్థిరంగ ఉండటంతో కర్శకులు దానిమ్మ సాగు పై ఎక్కువ ఆసక్తి చూపిస్తుండటం వలన మండలంలో దానిమ్మ సాగు విస్తీర్ణం పెరుగుతున్న నేపథ్యంలో జిల్లా ఉద్యాన అధికారి మల్లెల గ్రామంలో దానిమ్మ తోటలు సందర్శించారు. మొక్కలకు నీరు కూడ ఎక్కువగా అవసరం ఉండకపోవడం, సమయానికి ప్రూనింగ్ చేసుకుంటే మొక్క ఎదుగుదల తో ఆశించిన మేరకు దిగుబడులు పొందవచ్చువచ్చునని దానిమ్మ సాగు చేస్తున్న రైతులు ఉద్యాన శాఖ లో ఒక హెక్టర్ కి 50 వేల చొప్పున గరిష్టంగా ఒక రైతుకు 2 హేక్టర్ల చొప్పున లక్ష వరకు ప్రభుత్వం రాయితీ ఇవ్వనుంది..ఎల్ నినో దృష్ట అన్ని రకాల ఉద్యాన పంటలకు వీడ్ మాట్ ఏర్పాటు చేసుకున్నట్లయితే నిర్వహణ వ్యయం చదరపు మీటరుకు 50 రూపాయలుగా ఉందని ఉద్యానవన శాఖ ఈ ఖర్చుపై 50 శాతం రాయితీని (అంటే ₹25) అందిస్తోంది. ఈ రాయితీ ఒక్కో రైతుకు 4,000 చదరపు మీటర్ల రాయితీ వర్తిస్తుందని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి హరి ప్రసాద్ తెలిపారు. పంటల సాగు చేసుకోదలచిన రైతులు,మీ గ్రామ రైతు సేవా కేంద్రాల్లో పట్టాదారు పాసుబుక్, ఆధార్ కార్డు,1–బి, బ్యాంకు పాస్ బుక్ సమర్పించగలరని ఉద్యాన శాఖ అధికారి వివరించారు

# వైవీయూను సందర్శించిన వ్యవసాయ కళాశాల విద్యార్థులు

## • పుట్టగొడుగుల పెంపకంపై అవగాహనం

## కల్పించిన ప్రొఫెసర్ చంద్రమతి శంకర్

**కడప మనజనప్రగతి జూలై 25:–** గుంటూరులోని ఎల్.ఏ.ఎం.ఎన్.జి రంగ విశ్వవిద్యాలయ అనుబంధ కళాశాల అయిన పులివెందుల వ్యవసాయ కళాశాల ప్రథమ సంవత్సరం బి.ఎస్.సి (ఆనర్స్) వ్యవసాయ విద్యార్థులుశనివారం యోగి వేమన విశ్వవిద్యాలయంలోని పుట్టగొడుగుల సాగు కేంద్రాన్ని సందర్శించారు. తమ కోర్సు పాఠ్యప్రణాళిక (పుట్టగొడుగుల ఉత్పత్తి సాంకేతికత)లో భాగంగా వారు ప్రత్యక్ష పరిశీలన కోసం ఇక్కడ ప్రయోగశాలను సందర్శించారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ పుట్టగొడుగుల సాగు కేంద్రం కోఆర్డినేటర్ ప్రొఫెసర్ పి.చంద్రమతి శంకర్ ఈ సందర్భంగా ప్రయోగశాలలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ తక్కువ ఖర్చుతో రైతులు చక్కటి ఆదాయాన్ని పొందేందుకు పుట్టగొడుగుల సాగు చేపట్టవచ్చు అన్నారు. యువత కూడా అతి తక్కువ పెట్టుబడితో కుటుంబ పరిశ్రమగా ఆదాయాన్ని గడించవచ్చు అన్నారు. పుట్టగొడుగుల సాగులో కావలసినవి, ఖర్చు, వివిధ దశల (స్పాన్ ఉత్పత్తి, బెడ్ తయారీ, బెడ్ తయారీకి అవసరమైన సబ్‌స్ట్రేట్‌లు, ఇంక్యుబేషన్, కేసింగ్, హార్వెస్టింగ్) గురించి వివరంగా వివరించారు. మిల్కీ మష్రూమ్ అలానే ఆయిస్టర్ మష్రూమ్‌లను ఎలా సాగు చేసి పెంచుతారో వారికి చూపించారు. విద్యార్థులతో పాటు వ్యవసాయ కళాశాల సూక్ష్మజీవశాస్త్ర విభాగాధిపతి, వారి అధ్యాపకుడు ప్రొఫెసర్ ఆర్.లక్ష్మీపతి,డాక్టర్ పి.రామంజనేయులు, డాక్టర్ జస్మిత మిలికిరెడ్డిలు " వై వి యు ల్యాబ్ అసిస్టెంట్ జి. దిలీప్ పాల్గొన్నారు.



# రూ.40.32 లక్షలతో ఎస్సీ హాస్టళ్ల అభివృద్ధి: మంత్రి కందుల దుర్గేష్



**నిడదవోలు,మన జనప్రగతి జూలై 25: –** నిడదవోలు నియోజకవర్గంలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ హాస్టళ్ల అభివృద్ధికి రూ.40.32 లక్షలు మంజూరు చేసినట్లు రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. పెరవలి మండలం కానూరులో జరిగిన కార్యక్రమంలో కానూరు, ఉండ్రాజవరం, ఖండవల్లి, సమిశ్రగూడెం హాస్టళ్ల విద్యార్థులకు టవల్స్, నైట్ డ్రస్సులు, స్వెటర్లు, బెడ్‌షీట్లు, ప్లేట్లు, గ్లాసులు, మెటీరియల్ కిట్లను పంపిణీ చేశారు. హాస్టళ్లలో మౌలిక వసతుల కల్పన, మరమ్మత్తుల కోసం ఈ నిధులు వినియోగిస్తున్నామని తెలిపారు. త్వరలోనే నియోజకవర్గంలోని సాంఘిక సంక్షేమ హాస్టళ్లపై ప్రత్యేక సమీక్ష నిర్వహిస్తామని చెప్పారు. చదువే పేదరికాన్ని జయించే శక్తివంతమైన ఆయుధమని పేర్కొన్న మంత్రి, విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో ఉన్నత లక్ష్యాలను సాధించాలని పిలుపునిచ్చారు. విద్యార్థుల సంక్షేమం, నాణ్యమైన విద్యకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి దుర్గేష్ తెలిపారు.

# డీఎస్సీలో అక్రమాలు... మంత్రి నారా లోకేష్ తక్షణమే రాజీనామా చేయాలి

- డీఎస్సీ వ్యవహారంపై సీబీఐ విచారణ జరిపించాలి
- వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నాయకులు రామ్ లక్ష్మణ్ రెడ్డి,రాఘవేంద్ర రెడ్డి




**పులివెందుల అర్బన్ మన జనప్రగతి జులై 25:–** ఆంధ్రప్రదేశ్‌లో డీఎస్సీ ఉద్యోగాలను అమ్ముకుని, నిరుద్యోగుల భవిష్యత్తుతో ఆడుకుంటున్న రాష్ట్ర విద్యారంగ మంత్రి నారా లోకేష్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పులివెందుల నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు రామ్ లక్ష్మణ్ రెడ్డి,విద్యార్థి విభాగం జిల్లా కోశాధికారి రాఘవేంద్ర రెడ్డి తీవ్రంగా డిమాండ్ చేశారు. శనివారం వైయస్ఆర్సీపీ కార్యాలయంలో పత్రిక విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను ఏవిధంగా నిలదీసి రాజీనామా దిశగా ఒత్తిడి తెచ్చారో,అదే రీతిలో ఆంధ్రప్రదేశ్ యువత కూడా ఐక్యంగా ముందడుగు వేసి లోకేష్‌కి తగిన బుద్ధి చెప్పాలని వారు పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డీఎస్సీ నిర్వహణలో భారీగా అవకతవకలు జరిగాయని ఆరోపించారు.వీటిపై ప్రశ్నించిన వారిపై అన్యాయంగా దాడులకు పాల్పడుతున్నారని మండిపడ్డారు.డీఎస్సీ వ్యవహారంపై మంత్రి లోకేష్ రాష్ట్ర ప్రజలకు సమాధానం చెప్పాలని,ఈ మొత్తం అక్రమాలపై కేంద్ర దర్యాప్తు సంస్థ (సిబిఐ) ద్వారా నిష్పాక్షిక విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

## విద్యాశాఖ మంత్రి రాజీనామాపై విద్యార్థి యువజన సంఘాల విజయోత్సవం



**పత్తికొండ మన జనప్రగతి జూలై 25:–** పత్తికొండ నియోజకవర్గ కేంద్రంలోని నాలుగు స్తంభాల కూడలి వద్ద విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో విజయోత్సవ కార్యక్రమం నిర్వహించారు. విద్యాశాఖ మంత్రి రాజీనామా చేసిన నేపథ్యంలో సంఘాల నాయకులు టపాసులు పేల్చి సంబరాలు జరుపుకున్నారు.ఈ సందర్భంగా ఆల్ ఇండియా యూత్ ఫెడరేషన్ (ఏఐవైఎఫ్) జిల్లా ఉపాధ్యక్షులు అన్వేష్ మాట్లాడుతూ.. విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన ఉద్యమంలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. తమ డిమాండ్లు పూర్తిగా నెరవేరే వరకు ఉద్యమం కొనసాగుతుందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ నాయకులు అల్తాఫ్, మోహన్, నజీర్, శివ తదితర విద్యార్థి, యువజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# గ్రామీణ ప్రతిభను వెలికితీసేందుకే 'అమరావతి ఛాంపియన్షిప్'

- క్రీడాకారులు అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి: ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి



**పులివెందుల అర్బన్ మన జనప్రగతి జులై 25:** గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభావంతులైన క్రీడాకారులను వెలికితీసి,వారిని ప్రోత్సహించేందుకే అమరావతి ఛాంపియన్షిప్ క్రీడా పోటీలను నిర్వహిస్తున్నామని శాసనమండలి సభ్యులు (ఎమ్మెల్సీ) భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి తెలిపారు.పులివెందుల నియోజకవర్గ పరిధిలోని వైఎస్సార్ క్రీడా ప్రాంగణంలో శనివారం అమరావతి ఛాంపియన్షిప్ క్రీడా పోటీలు అత్యంత ఉత్సాహపూరిత వాతావరణంలో వైభవంగా ప్రారంభమయ్యాయి.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను అధికారికంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు కేవలం శారీరక దృఢత్వానికే కాకుండా మానసిక వికాసానికి,క్రమశిక్షణకు ఎంతగానో తోడ్పడతాయని పేర్కొన్నారు.ప్రభుత్వం క్రీడారంగానికి అందిస్తున్న ప్రోత్సాహాన్ని,ఇలాంటి గొప్ప వేదికలను క్రీడాకారులు ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకుని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు.ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో వివిధ క్రీడల కోచ్‌లు,క్రీడా ప్రాంగణ అధికారులు,వ్యాయామ ఉపాధ్యాయులు,పెద్ద సంఖ్యలో క్రీడాకారులు పాల్గొన్నారు.

## అంత్యక్రియలకు ఆర్థిక సాయం అందించిన మార్కెట్ కమిటీ ఛైర్మన్ షఫీ నాయక్



**రాయచోటి స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి జూలై 25:–** ఆపదలో ఉన్న కుటుంబానికి లక్కీరెడ్డిపల్లి మార్కెట్ యార్డ్ చైర్మన్ డా. ఎస్ఎండి షఫీ నాయక్ అండగా నిలిచారు. రామాపురం మండలానికి చెందిన గంగులయ్య మృతి చెందగా, అంత్యక్రియలకు ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్న విషయం తెలుసుకున్న ఆయన వెంటనే స్పందించారు.రామాపురం మండలానికి వెళ్లిన చైర్మన్ షఫీ నాయక్, గంగులయ్య తమ్ముడి కుమారుడికి అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం ఆర్థిక సాయం అందజేశారు. మానవతా దృక్పథంతో చేసిన ఈ సహాయంపై స్థానికులు, ప్రజా సంఘాల నాయకులు అభినందించారు.ఈ సందర్భంగా షఫీ నాయక్ మాట్లాడుతూ.. గంగులయ్య గతంలో లక్కీరెడ్డిపల్లి మార్కెట్ యార్డ్ కార్యాలయంలో వాచ్‌మెన్‌గా పనిచేశారని, ఏడాది క్రితమే పదవీ విరమణ పొందారని తెలిపారు. కష్టకాలంలో ఉన్న వారికి అండగా నిలవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ఆపదలో ఉన్న వారికి ఎల్లప్పుడూ సహాయం చేసేందుకు ముందుంటానని పేర్కొన్నారు.

# ప్రజా పోరాటాల ఒత్తిడికి కేంద్రం తలవంచింది:డి.రాజా సాహెబ్

- నీట్ పరీక్ష వ్యవహారంలో బాధ్యులపై చర్యలు తీసుకోవాలి



**పత్తికొండ మన జనప్రగతి జూలై 25:–** నీట్ పరీక్షల పేపర్ లీకేజీ ఘటనతో లక్షలాది మంది పేద, మధ్యతరగతి విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని, దీనిపై విద్యార్థి, యువజన సంఘాలు చేపట్టిన ఉద్యమాల ఫలితంగానే కేంద్ర ప్రభుత్వం ఒత్తిడికి లోనైందని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు డి. రాజా సాహెబ్ పేర్కొన్నారు.ప్రజా పోరాటాల ముందు ఎంతటి ప్రభుత్వాలైనా తలవంచక తప్పదని ఈ పరిణామం మరోసారి నిరూపించిందన్నారు.లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడితే సహించబోమని హెచ్చరించిన ఆయన, విద్యారంగాన్ని కార్పొరేట్ శక్తులకు అప్పగించే ప్రయత్నాలను సిపిఐ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని స్పష్టం చేశారు.విద్యార్థులు, నిరుద్యోగుల సమస్యల పరిష్కారం కోసం పార్టీ పోరాటం నిరంతరం కొనసాగుతుందని తెలిపారు.ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థలో సమగ్ర సంస్కరణలు చేపట్టి, పరీక్షల నిర్వహణలో పారదర్శకత, జవాబుదారీతనం పాటించేలా చర్యలు తీసుకోవాలని డి. రాజా సాహెబ్ డిమాండ్ చేశారు.

# జులై 30న కలెక్టరేట్ ధర్నాకు తరలిరండి:సీఐటీయూ



**పత్తికొండ మన జనప్రగతి జులై 25:–** కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు నెలకు రూ.26 వేల కనీస వేతనం, చట్టబద్ధమైన కార్మిక హక్కులు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 30న కర్నూలు కలెక్టరేట్ ఎదుట నిర్వహించనున్న మహా ధర్నాను విజయవంతం చేయాలని సీఐటీయూ నాయకులు పిలుపునిచ్చారు.ఈ మేరకు పత్తికొండ పట్టణంలోని కస్తూర్బా గురుకుల పాఠశాలలో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమావేశం నిర్వహించారు.సమావేశంలో సీఐటీయూ మండల కార్యదర్శి ఎం. రవిచంద్ర, గురుకుల కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘం కార్యదర్శి వై.శ్రీలక్ష్మి మాట్లాడుతూ ఉద్యోగులకు కనీస వేతనం,పీఎఫ్, ఈఎస్ఐ, బోనస్, గ్రాట్యుటీ, సెలవులు వంటి చట్టబద్ధమైన సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఎనిమిది గంటల పని విధానాన్ని అమలు చేసి, పనికి తగిన వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో సి. ఈరమ్మతో పాటు బాట లక్ష్మి, జయలక్ష్మి, దేవి, బి. గౌరమ్మ, రుతు, గౌరీ, లక్ష్మీదేవి, సులోచన, నాగవేణి, స్వరూప, అనిత, వహీదా, సరస్వతి తదితరులు పాల్గొన్నారు

## విద్యార్థులు ఉన్నత లక్ష్యాల దిశగా విద్యను అభ్యసించాలి: తహసీల్దార్ శివశంకర్ రెడ్డి



**వేంపల్లె మన జనప్రగతి జూలై 25:–** విద్యార్థులు ఇంటర్ స్థాయి నుంచే తమ జీవిత లక్ష్యాలను నిర్దేశించుకుని, వాటి సాధనకు అనుగుణంగా ప్రణాళికాబద్ధంగా చదువులు కొనసాగించాలని వైఎస్సార్ వేంపల్లె తహసీల్దార్ శంకర్ రెడ్డి సూచించారు. స్థానిక అక్షర బాలికల జూనియర్ కళాశాలలో నిర్వహించిన ఫ్రెషర్స్ డే వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. స్పష్టమైన లక్ష్యం, క్రమశిక్షణ, పట్టుదల ఉంటే జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించడం సాధ్యమవుతుందన్నారు. వేంపల్లి ఎస్సై తిరుపాల్ నాయక్ మాట్లాడుతూ, క్రమశిక్షణతో కూడిన విద్యే విద్యార్థులను ఉన్నత స్థాయికి చేర్చే మార్గమన్నారు. విద్యార్థులు చదువుతో పాటు మంచి నడవడి, సమయపాలన అలవర్చుకుని భవిష్యత్తులో సమాజానికి ఆదర్శంగా నిలవాలన్నారు. కళాశాల కరస్పాండెంట్ భూమిరెడ్డి విజయభారతి మాట్లాడుతూ, విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధే కళాశాల ప్రధాన లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి భూమిరెడ్డి శ్రీనాథ్ రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## వేంపల్లె అమ్మవారిశాలలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం

**వేంపల్లె మన జనప్రగతి జూలై 25:–** వేంపల్లెలోని శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో వాసవి మాతకు భక్తి శ్రద్ధలతో ఆలయ అర్చకులు ఇంద్రకంటి ప్రసాద్ శర్మ నేతృత్వంలో తొలి ఏకాదశి పూజలు నిర్వహించామని ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు తోటంశెట్టి చంద్రశేఖర్,మహిళా మండలి అధ్యక్షురాలు బచ్చు భాగ్యేశ్వరమ్మ తెలిపారు.ఈ సందర్భంగా అమ్మవారిశాలలో సామూహిక శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహించారు. మహిళా మండలి అధ్యక్షురాలు మాట్లాడుతూ తొలి ఏకాదశి రోజు సత్యనారాయణ స్వామి వ్రతం చేయడం వలన విశేష ఫలితంతో పాటు ఆయురారోగ్య ఐశ్వర్య సౌభాగ్యాలు కలుగుతాయని తెలిపారు.భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షులు రాయవరం సుబ్బు, ఆలయ నిర్వాహకులు మిట్టా ప్రవీణ్ కుమార్,మహిళా మండలి కార్యవర్గ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



# ప్రొద్దుటూరులో మహిళ అనుమానాస్పద మృతి..!

- నాలుగు రోజుల తర్వాత వెలుగులోకి ఘటన..



**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి జూలై 25:–** కడప జిల్లా ప్రొద్దుటూరు మండలం బంగారయ్య కొట్టాలలో ఓ మహిళ అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. మృతురాలిని మేకల సుసన్ రాణి (44)గా పోలీసులు గుర్తించారు.ప్రాథమిక సమాచారం ప్రకారం, మహిళ నాలుగు రోజుల క్రితమే మృతి చెందినట్లు భావిస్తున్నారు.దీంతో ఇంటి నుంచి దుర్వాసన రావడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ఇంట్లో ఉన్న కుళ్లిన మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పరిశీలించారు.మృతురాలి భర్త ప్రభుత్వ ఆసుపత్రిలో కాంపౌండర్‌గా పనిచేస్తున్నట్లు సమాచారం.ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి,మృతికి గల కారణాలపై దర్యాప్తు చేపట్టారు.పోస్టుమార్టం నివేదిక అనంతరం పూర్తి వివరాలు వెల్లడికానున్నాయి.

## హత్య కేసులో ఇద్దరు ముద్దాయిల అరెస్ట్

- ఆరు నెలల విచారణ తర్వాత ఛేదించిన పోలీసులు



**వీరబల్లి మన జనప్రగతి జులై 25:–** మండలం పరిధిలో తాటిగుంటపల్లె పంచాయతీలో కొత్తపల్లికి చెందిన వీరబల్లి వెంకట లక్ష్మమ్మ హత్య కేసులో ఇద్దరి ముద్దాయిలను శనివారం స్థానిక ఎస్ఐ సుస్మిత ఆధ్వర్యంలో అరెస్ట్ చేయడం జరిగింది. వివరాల్లోకి వెళితే ఇలా ఉన్నాయి, వెంకట లక్ష్మమ్మ గత జనవరి నెల 31వ తేదీన ఊరు బయట బాయిలో శవమై కనిపించింది. స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు మేరకు అనుమానస్పదంగా మృతి చెందినట్లు కేసు నమోదు చేశారు.

ఈ కేసు పై పోలీస్ అధికారులు స్పందించి విచారణ వేగవంతం చేయడంతో ఆమె భర్త రమణయ్య, అతని మొదటి భార్య కుమారుడు మహేష్ కలిసి చంపి బాయిలో వేసినట్లు రుజువు కావడంతో వారిని అరెస్టు చేసి డిమాండ్ కు పంపినట్లు పోలీసులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సుండుపల్లె సీఐ సురేష్ రెడ్డి, పోలీస్ సిబ్బంది. పాల్గొన్నారు.

## అరుదైన వ్యాధితో బాబు శ్యామ్ పోరాటం

- పులివెందుల ప్రజలారా చేయూతనందిద్దాం



**పులివెందుల అర్బన్ మన జనప్రగతి జులై 25:–** 'ఎస్.ఎం.ఎ టైప్ – 1' అనే అరుదైన వ్యాధితో మరణంతో పోరాడుతున్న చిన్నారి బాబు శ్యామ్‌ను కాపాడుకునేందుకు సోమవారం ఉదయం 9:30 గంటలకు పులివెందుల పట్టణంలో విరాళాల సేకరణ ర్యాలీ చేపట్టనున్నారు. చికిత్సకు అయ్యే కోట్లాది రూపాయల ఖర్చును భరించేందుకు దాతల సహకారం కోరుతున్నారు.చిన్నారికి పునర్జన్మ నిచ్చేందుకు పట్టణ ప్రజలు, సేవా తత్పరులు ఈ ర్యాలీలో పెద్ద సంఖ్యలో పాల్గొని,తోచినంత ఆర్థిక సాయం (బ్యాంక్ ఖాతా/క్యూ.ఆర్ కోడ్ ద్వారా) అందించాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు.

### సిద్ధవటంలో 'బేటీ బచావోబేటీ పడావో'పై అవగాహన కార్యక్రమం

**సిద్ధవటం మన జనప్రగతి జూలై 25:–** కడప ఐసీడీఎస్ అర్బన్ ఇన్‌చార్జి సీడీపీవో సుగుణ ఆధ్వర్యంలో స్థానిక బెటాలియన్ జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో శనివారం 'బేటీ బచావోబేటీ పడావో' అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాలికల సంరక్షణ, విద్య, సాధికారతపై విద్యార్థులు, ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీడీపీవో సుగుణ మాట్లాడుతూ, బాలికల విద్యాభివృద్ధి కుటుంబంతో పాటు సమాజ ప్రగతికి దోహదపడుతుందని పేర్కొన్నారు. బాలికలపై వివక్షను నిర్మూలించి సమాన అవకాశాలు కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యతన్నారు. బాల్య వివాహాలు, లైంగిక వేధింపులు, బాలికల అక్రమ రవాణా, మధ్యలోనే చదువు మానివేయడం వంటి ఘటనలు ఎదురైతే వెంటనే చైల్డ్ హెల్ప్‌లైన్1098కు సమాచారం ఇవ్వాలని సూచించారు. విద్యార్థులు తమ హక్కులు, చట్టాలపై అవగాహన పెంచుకొని ధైర్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ప్రధానోపాధ్యాయుడు పోతుల వీరయ్య, అంగన్వాడీ సూపర్వైజర్లు శ్రీవిద్య, దీప, ఉపాధ్యాయులు, అంగన్వాడీ కార్యకర్తలు, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.



# పులివెందులలో కన్నులపండువగా 'తొలి ఏకాదశి' వేడుకలు

**• శ్రీ సత్యనారాయణ స్వామి కళ్యాణం,వ్రతం ఆలయాల్లో భక్తుల కిటకిట**





**పులివెందుల అర్బన్ మన జనప్రగతి జులై 25:** తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని పులివెందుల పట్టణంలోని ఆధ్యాత్మిక క్షేత్రాలు భక్తిపారవశ్యంతో ఓలలాడాయి. స్థానిక శ్రీ మిట్టమల్లేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో వెలసిన శ్రీ సత్యనారాయణ స్వామి ఆలయంలో శ్రీలక్ష్మీ,భూదేవి సమేత శ్రీ సత్యనారాయణ స్వామివారి కళ్యాణోత్సవం,వ్రత మహోత్సవం శనివారం అత్యంత వైభవంగా జరిగాయి. జూటూరు నాగసుగుణాకర్ కుటుంబ సభ్యుల సౌజన్యంతో,ప్రధాన పురోహితులు రుద్రమూర్తి ఆధ్వర్యంలో వేదమంత్రాలు,మంగళ వాయిద్యాల నడుమ శాస్త్రోక్తంగా ఈ వేడుకలను నిర్వహించారు. అర్చకులు మాంగల్య ధారణ ఘట్టాన్ని భక్తుల జయ జయధ్వానాల మధ్య కన్నులపండువగా పూర్తి చేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణ స్వామి వ్రత ప్రాశస్త్యాన్ని,మహత్యాన్ని భక్తులకు వివరించి కథాశ్రవణం చేయించారు. అనంతరం భక్తులకు పెద్ద ఎత్తున తీర్థప్రసాద వితరణ చేపట్టారు. **రంగనాథస్వామి,వేంకటరమణుడి ఆలయాల్లో విశేష పూజలు** తొలి ఏకాదశి సందర్భంగా పట్టణంలోని అత్యంత పురాతనమైన శ్రీ రంగనాథస్వామి వారి ఆలయంలో అర్చకులు కృష్ణరాజేషశర్మ ఆధ్వర్యంలో స్వామివారికిపంచామృతాభిషేకం,ప్రత్యేక అలంకరణలు చేశారు. ఉదయం నుంచే భక్తులు స్వామివారిని దర్శించుకుని కాయకర్పూరాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పద్మావతి సమేత కల్యాణ వెంకటరమణుడి ఆలయంలో అర్చకులు వరదాచార్యుల పర్యవేక్షణలో ప్రత్యేక పూజలు,అర్చనలు నిర్వహించారు. భక్తులకు స్వామివారి ప్రసాదాలను పంపిణీ చేశారు.

# ఏపీ క్రీడారంగంలో ఇతర రాష్ట్రాల కంటే ముందున్నాలన్నదే సీఎం ధ్యేయం

**- తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడుగాజుల ఖాదర్ బాషా**



**అన్నమయ్య జిల్లా బ్యూరో మన జనప్రగతి జులై 25:**-క్రీడలు వ్యాయామం వల్ల విద్యార్థులు విద్యార్థినులు ఆరోగ్యంగా చురుకుగా ఉంటారని గాజుల ఖాదర్ బాషా పేర్కొన్నారు. మంత్రి మండి పల్లి రాంప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో రాయచోటి ప్రభుత్వ జూనియర్ కళాశాల నందు అమరావతి ఛాంపియన్షిప్ 2026 కార్యక్రమం నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా గాజులఖాదర్ భాష మాట్లాడుతూ...రాష్ట్రంలోని 175 నియోజకవర్గాలలో నిర్వహిస్తున్న అమరావతి ఛాంపియన్షిప్ ద్వారా సుమారు రెండు లక్షల పైచిలుకు క్రీడాకారులు పాల్గొనేలా శాప్ సమగ్ర కార్యాచరణ రూపొందించిందని గాజుల ఖాదర్బాషా తెలిపారు. మన రాష్ట్రంలో విద్యార్థులు విద్యార్థినులు చక్కటి ప్రతిభ కనబరచి క్రీడారంగంలో పేరు ప్రఖ్యాతలు తెచ్చి మా రాష్ట్రానికి వన్నె తేవాలని చెప్పారు గౌరవ ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబునాయుడు ప్రతి కాన్ఫరెన్స్ మీటింగ్ లో ఆరోగ్యం గురించి జాగ్రత్త పడాలని తెలుగుదేశం పార్టీ నాయకులకు కుటుంబ సభ్యులకు తెలుపుతున్నారని చెప్పారు ఆరోగ్యం బాగుంటే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని చెప్పారు మంత్రి మండపల్లి రాంప్రసాద్ రెడ్డి రాయచోటిలో క్రీడా రంగాన్ని అభివృద్ధి చేయాలని ఎంతగానో కృషి చేసి ఇండోర్ స్టేడియం మంజూరు చేశారని త్వరలో పనులు కూడా ప్రారంభిస్తారని తెలిపారు మంత్రిగా ఆయన రావడం రాయచోటి వాసులు చేసుకున్న అదృష్టమని చెప్పారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ చాంద్ బాష పిఇ టి అధ్యాపకులు అంజి మరియు నరసింహ రాజు రెడ్డయ్య ఎం ఈ ఓ బాలాజీ నాయక్ మరియు అధ్యాపకులు క్రీడాకారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

# వాతావరణ బీమాకు డెడ్‌లైన్ పొడిగింపు..!

- 24 నుంచి జూలై 31 వరకు పెరిగిన గడువు..
- రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలి
- వేముల మండల వ్యవసాయ అధికారి జిపి ఓబులేసు



**వేముల మన జనప్రగతి జూలై 25:**-వాతావరణ బీమా నమోదు గడువును ప్రభుత్వం పొడిగించిందని మండల వ్యవసాయ అధికారి జి.పి ఓబులేసు తెలిపారు. వేముల మండలంలో సాగు చేస్తున్న అరటి, బత్తాయి/చీని, వేరుశనగ, పత్తి పంటలకు సంబంధించి ఈ నెల 24వ తేదీ వరకు ఉన్న గడువును జూలై 31వ తేదీ వరకు పొడిగించినట్లు ఆయన శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్హత కలిగిన రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. **ఎకరాకు నిర్ణయించిన బీమా ప్రీమియం వివరాలు** వాతావరణ బీమా కింద రైతులు నిర్ణయించిన ప్రీమియం చెల్లించి పంటలను నమోదు చేసుకోవచ్చని తెలిపారు. వేరుశనగ పంటకు ఎకరాకు రూ.562, చీని/బత్తాయి పంటకు రూ.2,782, పత్తి పంటకు రూ.2,023, అరటి పంటకు రూ.3,061 చెల్లించి వాతావరణ బీమా పొందవచ్చని పేర్కొన్నారు. **డీకేటీ,ఇనం భూములకు కూడా బీమా అవకాశం** ఎన్‌సీఐపీ బీమా పోర్టల్‌లో ఆన్‌లైన్ భూములతో పాటు డీకేటీ, ఇనం భూములకు కూడా బీమా చేసుకునే వెసులుబాటును ప్రభుత్వం కల్పించిందని తెలిపారు. రుణాలు పొందని రైతులు తమ భూమి పాస్‌బుక్, ఆధార్ కార్డు, సెల్ఫ్ డిక్లరేషన్ ఫారంతో మీసేవ లేదా కామన్ సర్వీస్ సెంటర్లలో బీమా నమోదు చేసుకోవాలని సూచించారు. బ్యాంకుల ద్వారా పంట రుణాలు పొందిన రైతులు సంబంధిత బ్యాంకు అధికారులను సంప్రదిస్తే బీమా నమోదు ప్రక్రియ పూర్తి చేస్తారని తెలిపారు. నిర్ణీత గడువులోగా రైతులు ఈ అవకాశాన్ని తప్పక వినియోగించుకోవాలని మండల వ్యవసాయ అధికారి జి.పి. ఓబులేసు కోరారు.

# రూ.13 లక్షల విలువైన పుస్తకాల పంపిణీ

- జిల్లా కేంద్ర గ్రంథాలయంలో పోటీ పరీక్షల గ్రంథాల బహూకరణ
- గ్రంథాలయాల అభివృద్ధికి సహకారం అందిస్తా:ఎమ్మెల్యే కొండబాబు



**కాకినాడ మన జనప్రగతి జూలై 25:**-ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో శనివారం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో రూ.13 లక్షల విలువైన పుస్తకాలను పంపిణీ చేశారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ భూపతిరాజు ఈశ్వర్‌రాజు వర్మ (సాయిబాబురాజు) అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు (కొండబాబు) ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎంస్కో సంస్థ, భూపతిరాజు భరత్ వర్మ జ్ఞాపకార్థం అందించిన పోటీ పరీక్షలకు ఉపయోగపడే పుస్తకాలతో పాటు మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు రచించిన 100 పుస్తకాలను ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని సుమారు 100 గ్రంథాలయాలకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొండబాబు మాట్లాడుతూ, శిథిలావస్థలో ఉన్న జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని అభివృద్ధి పథంలో నడిపించిన చైర్మన్ భూపతిరాజును అభినందించారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు అందించడం అభినందనీయమన్నారు. గ్రంథాలయ అభివృద్ధికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో అంబేద్కర్ కోనసీమ జిల్లా టీడీపీ ఉపాధ్యక్షులు లంకె శ్రీనివాసరావు, గోగన్నమఠం గ్రామశాఖ అధ్యక్షులు భూపతిరాజు సత్యరంగరాజు, జిల్లా గ్రంథాలయ కార్యదర్శి కె.జె.ఎల్. కుమారి, ఉప గ్రంథాలయ అధికారి కె. కిశోర్, శ్రావణి, గ్రంథాలయ సిబ్బంది, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

# ప్రజలకు నిరంతర తాగునీరు అందించడమే లక్ష్యం: ఎంపీడీఓ విజయభాస్కర్





**బొమ్మనహల్ మన జనప్రగతి జూలై 25:**-మండల పరిధిలో దర్గా హొన్నూరు గ్రామంలో త్రాగునీటి సరఫరా వ్యవస్థను మండల ఎంపీడీఓ విజయభాస్కర్ పరిశీలించారు,ఈ సందర్భంగా గ్రామంలోని వాటర్ సోర్సులను తనిఖీ చేసి,ఎక్కడైనా మరమ్మతులు అవసరమైతే వెంటనే చేపట్టి తాగునీటి సరఫరాకు ఎలాంటి అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని పంచాయతీ అభివృద్ధి అధికారికి ఆదేశాలు జారీ చేశారు,పస్తుతం ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి వాటర్ సోర్స్‌కు ఒక ఉద్యోగిని ఇన్‌చార్జిగా నియమించాలని సూచించారు, ఆయా ఇన్‌చార్జిలు ప్రతిరోజూ వాటర్ సోర్సులను పరిశీలిస్తూ భూగర్భ జలాలు తగ్గడం, మోటార్లు లేదా పైప్‌లైన్లలో లోపాలు వంటి సమస్యలు తలెత్తిన వెంటనే పంచాయతీ అభివృద్ధి అధికారి దృష్టికి తీసుకెళ్లి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు,గ్రామ ప్రజలకు నిరంతర తాగునీటి సరఫరా అందేలా చూడాలని గ్రామ అధికారికి ఎంపీడీఓ విజయభాస్కర్,సూచించారు.

# అప్పాజీ విశిష్టతను చాటుతున్న కణవి తిమ్మలాపురం శాసనం వెలుగులోకి

**• పుష్పగిరి చెన్నకేశవ స్వామి,హనుమంత ఆలయాలకు చారిత్రక ఆధారాలు**



**చెన్నూరు మన జనప్రగతి జూలై 25:**-విజయనగర సామ్రాజ్య చరిత్రలో శ్రీకృష్ణదేవరాయల పాలనకు వెన్నెముకగా నిలిచిన మహామంత్రి సాళువ తిమ్మరుసు (అప్పాజీ) విశిష్టతను చాటే అరుదైన చారిత్రక శిలాశాసనం వెలుగులోకి వచ్చింది. కర్ణాటక రాష్ట్రం బళ్లారి జిల్లా కణవి తిమ్మలాపురం గ్రామంలోని దంగేరహోణి అంగన్‌వాడీ కేంద్రం సమీపంలో ఈ శాసనం గుర్తించారు. మైసూర్ ఆర్కియాలజీ డైరెక్టర్ మునిరత్నంరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కన్నడ భాష, లిపిలో చెక్కబడిన ఈ శాసనం శక సంవత్సరం 1435 (క్రీ.శ. 1513 జూన్ 15, బుధవారం) నాటిదిగా నిర్ధారించారు. ఈ శాసనం విజయనగర కాలంలోని సామాజిక, ధార్మిక, ప్రజా సంక్షేమ కార్యక్రమాలకు అద్దం పడుతోందని తెలిపారు. శాసనంలో నాగళబోవ కుమారులైన ఉళిగడ చిక్క గడ్డయ, హిరియ గడ్డయలు మహామంత్రి సాళువ తిమ్మరుసు అనుమతితో విజయనగర మహారాణి తిరుమలాదేవి పేరుతో కొత్త నగరాన్ని నిర్మించినట్లు పేర్కొన్నారు. అలాగే ప్రజల సౌకర్యార్థం ప్రతి బుధవారం వారపు సంత ఏర్పాటు చేయడంతో పాటు నీటి అవసరాల కోసం పెద్ద చెరువు (తటాకం) నిర్మించినట్లు వివరాలు ఉన్నాయి. అదేవిధంగా పుష్పగిరి ప్రాంతంలో చెన్నకేశవ స్వామి, శ్రీ హనుమంతుని ఆలయాలను నిర్మించి విగ్రహాలను ప్రతిష్టించినట్లు శాసనం తెలియజేస్తోంది. ఆలయ నైవేద్యాల కోసం విఠలాపురం చెరువు కింద ఉన్న 8 హొన్నుల ధనం, 5 కుళాల తరి భూమి, మేగనూరులోని 2 కుళాల నల్లరేగడి భూమిని దానంగా ఇచ్చినట్లు పేర్కొంది. విజయనగర సామ్రాజ్య పాలనలో మహామంత్రి సాళువ తిమ్మరుసు (అప్పాజీ)కు ఉన్న ప్రాధాన్యత, ప్రజా సంక్షేమంపై ఆయన చూపిన శ్రద్ధకు ఈ శాసనం చారిత్రక ఆధారంగా నిలుస్తోందని పురావస్తు నిపుణులు పేర్కొన్నారు.

# నేమకల్లు అంజన్నకు తొలి ఏకాదశి ప్రత్యేక పూజలు




**బొమ్మనహల్ మన జనప్రగతి జూలై 25:** -మండల పరిధిలో నేమకల్లు గ్రామంలోఅత్యంత ప్రసిద్ధి చెందిన ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం తొలి ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు వైభవంగా నిర్వహించారు, ఆలయ ప్రధాన అర్చకులు అనిల్‌కుమార్ చార్యులు స్వామి వారికి అభిషేకం, పట్టువస్త్ర సమర్పణ, పుష్పాలతో విశేష అలంకరణ,అర్చనలు నిర్వహించారు. స్వామి వారిని దర్శనం కోసంపెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు,అనంతరం భక్తుల సౌకర్యార్థం అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వహించారు.

# ప్రత్యేక ప్లాంటేషన్ కార్యక్రమానికి శ్రీకారం..

**- కొలగనహళ్లి,బొల్లనగుడ్డంలో 10 ఎకరాల్లో మొక్కల పెంపకం**



**బొమ్మనహల్ మన జనప్రగతి జూలై 25:**-జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డిడబ్ల్యుఎంఏ) పథక సంచాలకుల ఆదేశాల మేరకు స్పెషల్ ప్లాంటేషన్ ప్రోగ్రామ్‌లో భాగంగా బొమ్మనహల్ మండల పరిధిలో కొలగనహళ్లి,మరియు బొల్లనగుడ్డం గ్రామ పంచాయతీల పరిధిలో దాదాపుగా 10 ఎకరాల్లో మొక్కల పెంపకం కార్యక్రమాన్ని ప్రారంభించారు,ఈ సంధర్భంగా ఎంపీపీ,మండల కన్వీనర్, మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణతో పాటు భూసారాన్ని పెంపొందించడం,పచ్చదనాన్ని విస్తరించడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు,అందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యతను తీసుకోవాలని,పచ్చని వాతావరణ నిర్మాణానికి ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీడీఓ విజయభాస్కర్,ఎంపీపీ ముల్లంగి నాగమణి, నారాయణస్వామి,మండల కన్వీనర్ కురుబ మల్లన్న,మాజీ ఎంపీపీ స్వామి,ఏపీఓ లక్ష్మీకాంత బాయి,హాజరై మొక్కలు నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు,ఈకార్యక్రమంలో ఈసీలు నాగభూషణం,గ్రామ పెద్దలు కావలి ప్రభు, ఆంజనేయులు,సత్యనారాయణవి.బి.జిరామ్‌జీ సిబ్బంది, టీఏ,ఎఫ్ఏ,కూలీలు,గ్రామస్థులు పాల్గొన్నారు.

# ఘనంగా రుక్మిణి పాండురంగ స్వామి ప్రత్యేక పూజలు

**- తొలి ఏకాదశి వేడుకల్లో భక్తజన సందోహం**



**బొమ్మనహళ్ మన జనప్రగతి జూలై 25** :-మండల పరిధిలో ఉంతకల్లు గ్రామంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన రుక్మిణి పాండురంగ స్వామి దేవాలయంలో తొలి ఏకాదశి వేడుకలు అత్యంత వైభవంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు, ఈ శుభ సందర్భంగా తెల్లవారుజామునే వేదమంత్రోచ్చారణల మధ్య స్వామివారికి పవిత్ర జలాలతో అభిషేకం నిర్వహించారు, అనంతరం పంచామృతాభిషేకం, కుంకుమార్చన, పుష్పాలంకరణ, ఆకుపూజ తదితర ప్రత్యేక పూజలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా భక్తులు "విఠల.. విఠల.. రుక్మిణి పాండురంగ విఠల" అంటూ భక్తిశ్రద్ధలతో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్,కర్ణాటక, మహారాష్ట్ర,తెలంగాణ రాష్ట్రాల నుంచి తులసి మాలధారణ చేసిన భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారి ఆశీస్సులు పొందారు,దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు అన్నదాన ప్రసాదం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన కమిటీ సభ్యులు,గ్రామ పెద్దలు,భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మనజనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి... తెలుగు దినపత్రిక
26- 07 - 2026

# ప్రయాణికుడిని వదిలేసిన ఆర్టీసీ బస్సు..!

- డ్రైవర్ నిర్లక్ష్యంపై లిఖితపూర్వక ఫిర్యాదు
- డీఎం జోక్యం చేసుకుని చర్యలు తీసుకోవాలంటూ బాధితుడి విజ్ఞప్తి







**వేముల మన జనప్రగతి జూలై 25 :** డ్రైవర్ అనుమతి తీసుకుని టిఫిన్‌కు వెళ్లిన ప్రయాణికుడిని వేచి చూడకుండా ఆర్టీసీ బస్సు వెళ్లిపోవడం వివాదాస్పదమైంది. వేముల మండలం పెద్దజూటూరు గ్రామానికి చెందిన ఎం. రవీంద్రారెడ్డి ఈ ఘటనపై పులివెందుల డివిజనల్ మేనేజర్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు.రవీంద్రారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..శనివారం ఉదయం పులివెందులరాయచోటితిరుపతి ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తుండగా, ఉదయం 9.30 గంటల సమయంలో పీలేరు బస్టాండ్‌లో టిఫిన్ కోసం బస్సు ఆగింది. డ్రైవర్‌కు ముందుగానే అనుమతి తీసుకుని వెళ్లిన తాను ఐదు నిమిషాల్లో తిరిగి వచ్చినప్పటికీ, తన కోసం వేచి చూడకుండా బస్సును తీసుకెళ్లారని ఆరోపించారు.ప్రయాణికులందరూ ఎక్కారా లేదా అని కూడా నిర్ధారించకుండా బస్సు బయలుదేరిందని పేర్కొన్నారు.ఈ ఘటనతో అత్యవసర పని ఆలస్యమవడంతో పాటు అదనపు ఖర్చులు భరించాల్సి వచ్చిందని, తీవ్ర అసౌకర్యానికి గురయ్యానని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు.ప్రయాణికుల పట్ల బాధ్యతగా వ్యవహరించాల్సిన ఆర్టీసీ సిబ్బంది ఇలాంటి నిర్లక్ష్యానికి పాల్పడటం సరికాదని అన్నారు.ఈ ఘటనపై విచారణ జరిపి సంబంధిత డ్రైవర్‌పై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా డ్రైవర్లు, కండక్టర్లకు తగిన ఆదేశాలు జారీ చేయాలని డివిజనల్ మేనేజర్‌ను రవీంద్రారెడ్డి కోరారు. అధికారులు ఈ వ్యవహారంపై ఎలా స్పందిస్తారన్నది వేచి చూడాల్సి ఉంది.

# మదనపల్లె తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా అడుగు



**అన్నమయ్య జిల్లా,మన జనప్రగతి జూలై 25:-** మదనపల్లె నియోజకవర్గ తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం జల్ జీవన్ మిషన్ కింద రూ.1,000 కోట్లతో వాటర్ గ్రిడ్ ఫేజ్2కు ప్రభుత్వం ఆమోదం తెలిపిందని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ వెల్లడించారు.ఈ ప్రాజెక్టు ద్వారా మదనపల్లె, నిమ్మనపల్లె, రామసముద్రం మండలాలు, మదనపల్లె పట్టణానికి సురక్షితమైన తాగునీరు అందించనున్నారు. త్వరలో టెండర్లు పిలిచి పనులు ప్రారంభించి, 18 నెలల్లో ప్రాజెక్టును పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు కలెక్టర్ తెలిపారు.ఇప్పటికే వాటర్ గ్రిడ్ ఫేజ్1 పనులు కొనసాగుతున్నాయని, ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టు పూర్తయితే మదనపల్లె ప్రాంత ప్రజల తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు.

# టమాట ధరలపై అవాస్తవ ప్రచారాన్ని నమ్మొద్దు: ఏఎంసీ చైర్మన్



**మదనపల్లె,మన జనప్రగతి జూలై 25:-** మదనపల్లె మార్కెట్ యార్డులో టమాట ధర కిలో రూ.3 మాత్రమే ఉందన్న వార్తలు అవాస్తవమని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ జంగాల శివరామ్ తెలిపారు.గత రెండు రోజుల్లో టమాట ధరలు కిలోకు రూ.7 నుంచి రూ.11 వరకు ఉండగా, ప్రస్తుతం నాణ్యతను బట్టి రూ.12 నుంచి రూ.15 వరకు పలుకుతున్నాయని చెప్పారు. సరఫరా పెరగడంతో కొద్ది రోజుల పాటు ధరలు తగ్గినా ప్రస్తుతం క్రమంగా మెరుగుపడుతున్నాయని వివరించారు.ధరలు తగ్గిన సమయంలో రైతులకు మద్దతుగా ప్రభుత్వం 60 మెట్రిక్ టన్నుల టమాటలను కొనుగోలు చేసి ఇతర ప్రాంతాలకు తరలించిందని తెలిపారు. టమాట ధరలపై వార్తలు ప్రచురించే ముందు అధికారులను సంప్రదించి వాస్తవాలను నిర్ధారించుకోవాలని జంగాల శివరామ్ కోరారు.

# టమాటా ధరలపై తప్పుడు ప్రచారం సరికాదు: మంత్రి అచ్చెన్నాయుడు




**అమరావతి, మన జనప్రగతి జూలై 25:-** టమాటా ధరలపై వాస్తవాలను వక్రీకరిస్తూ రైతులకు కిలోకు రూ.2 మాత్రమే లభిస్తోందన్న ప్రచారం అవాస్తవమని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు.ప్రస్తుతం రాష్ట్రంలో టమాటా సగటు ధర కిలోకు రూ.10.55గా ఉందని, మదనపల్లెలో రూ.11 వరకు ధర నమోదవుతోందని తెలిపారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు ప్రభుత్వం మార్కెట్ పరిస్థితులను నిరంతరం సమీక్షిస్తూ అవసరమైన చర్యలు తీసుకుంటోందన్నారు.జూలై 5 నుంచి ఇప్పటివరకు 261 టన్నుల టమాటాను కొనుగోలు చేసి, రాష్ట్రవ్యాప్తంగా రైతు బజార్లలో 'నో లాస్‌నో ప్రాఫిట్' విధానంలో విక్రయిస్తున్నట్లు తెలిపారు.రైతుల సమస్యలను రాజకీయాల కోసం ఉపయోగించకుండా, వాస్తవాలను తెలుసుకుని మాట్లాడాలని మంత్రి సూచించారు. రైతుల ప్రయోజనాల పరిరక్షణకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని స్పష్టం చేశారు.

# ఖరీఫ్-2024 పంటల బీమా నిధుల విడుదలకు కేంద్రం గ్రీన్ సిగ్నల్: మంత్రి అచ్చెన్నాయుడు

**అమరావతి మన జనప్రగతి జూలై 25:-** వైసీపీ ప్రభుత్వ హయాంలో పెండింగ్‌లో ఉన్న సుమారు రూ.1,900 కోట్ల పంటల బీమా ప్రీమియాన్ని రాష్ట్ర ప్రభుత్వం విడతలవారీగా చెల్లిస్తామని హామీ ఇవ్వడంతో ఖరీఫ్-2024 పంటల బీమా బకాయిల విడుదలకు కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు.కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌తో చర్చల అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. కేంద్రం నిధులు విడుదల చేసిన వెంటనే అర్హులైన రైతుల ఖాతాల్లో బీమా సొమ్ము నేరుగా జమ అవుతుందని చెప్పారు.రైతుల సంక్షేమమే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేస్తున్నాయని మంత్రి పేర్కొన్నారు.

# ఉద్యాన శాఖ రాయితీలను సద్వినియోగం చేసుకోండి

**ఉద్యాన శాఖ అధికారి బి.దీప**

**రైతులకు ఫారం పాండ్లు,వీడ్ మాట్ ఏర్పాటుకు ప్రభుత్వం చేయూత**

**రైతు సేవా కేంద్రాల్లో దరఖాస్తుల స్వీకరణ**



**వేముల మన జనప్రగతి జూలై 25:**ఎల్‌నినో ప్రభావంతో మండల వ్యాప్తంగా నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్న రైతులు ఉద్యాన శాఖ అందిస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని మండల ఉద్యాన శాఖ అధికారి బి. దీప కోరారు.రైతుల నీటి సమస్య పరిష్కారానికి ప్రభుత్వం ఫారం పాండ్లు, వీడ్ మాట్ ఏర్పాటుకు రాయితీలు అందిస్తున్నట్లు ఆమె శనివారం తెలిపారు.ఈ సందర్భంగా ఉద్యాన శాఖ అధికారి బి. దీప మాట్లాడుతూ వ్యక్తిగతంగా 20-20-3 మీటర్ల విస్తీర్ణంలో ఫారం పాండ్ నిర్మించుకునే రైతులకు రూ.1.80 లక్షల వ్యయంలో 50 శాతం రాయితీగా రూ.90 వేలను ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. రైతులు సమూహాలుగా కలిసి కమ్యూనిటీ ఫారం పాండ్ నిర్మించుకుంటే 100-100-3 మీటర్ల పరిమాణంలో నిర్మాణానికి అయ్యే రూ.25 లక్షల వ్యయంలో 75 శాతం రాయితీ కింద రూ.18.75 లక్షల వరకు ప్రభుత్వం భరిస్తుందని వివరించారు.అలాగే చీనీ,దానిమ్మ సాగు చేస్తున్న రైతులకు వీడ్ మాట్‌ను 50 శాతం రాయితీతో అందిస్తున్నట్లు తెలిపారు. వీడ్ మాట్ వినియోగం వల్ల నేలలో తేమ శాతం నిల్వ ఉండటంతో పాటు కలుపు మొక్కల పెరుగుదలను నియంత్రించవచ్చన్నారు. చదరపు మీటరు వీడ్ మాట్ ధర రూ.50 కాగా, రాయితీ కింద రైతులకు రూ.25,000 అందిస్తున్నట్లు పేర్కొన్నారు.ఒక్కో రైతుకు గరిష్టంగా 4 వేల చదరపు మీటర్ల వరకు రాయితీ వర్తిస్తుందని తెలిపారు.అర్హత కలిగిన రైతులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆమె సూచించారు. ఫారం పాండ్లు, వీడ్ మాట్ కోసం ఆసక్తి ఉన్న రైతులు పట్టాదార్ పాస్‌బుక్, 1-బి, ఆధార్ కార్డు, బ్యాంక్ పాస్‌బుక్ జిరాక్స్‌లతో సంబంధిత రైతు సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని ఆమె కోరారు.

# నేడు(ఆదివారం) రాష్ట్ర పండుగగా ప్రకట కోటయ్య జయంతి

- చీరాలలో రాష్ట్ర జయంత్యోత్సవం
- హాజరుకానున్న మంత్రి సవిత




**అమరావతి మన జనప్రగతిజూలై 25:-** ప్రజాబంధు ప్రగడ కోటయ్య జయంతిని రాష్ట్ర పండుగగా కూటమి ప్రభుత్వం నిర్వహించనుంది. ఈ మేరకు ఇప్పటికే ప్రభుత్వం జీవో కూడా జీవో జారీచేసింది. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లోనూ ప్రగడ కోటయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించను న్నారు. కోటయ్య రాష్ట్ర స్థాయి జయంత్యోత్సవం బాపట్ల జిల్లాలోని చీరాలలో నిర్వహించనున్నారు. రాష్ట్రంలో చేనేత రంగ అభివృద్ధికి ప్రగడ కోటయ్య విశేష సేవలు అందించారు. స్వాతంత్ర్యం రాకముందు, వచ్చిన తరవాత కూడా రాష్ట్రంలో చేనేత రంగ పటిష్టతకు ఆయన అలుపెరగని కృషి చేశారు. మూడు సార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి ఎమ్మెల్సీగా, రాజ్యసభ సభ్యుడి పనిచేసిన ప్రగడ కోటయ్య ఆనాటి చేనేత కార్మికుల కష్టాలను చట్టసభల్లో వినిపించారు. 1952లో తొలిసారిగా మద్రాసు శాసనసభకు ఎంపికై, చీరలు, దోవతులు, చేనేత మగ్గాలపై ఉత్పత్తి చేయాలని ఆనాటి శాసనసభలో తీర్మానం చేయించారు. ఇదే అంశంపై ఆనాటి హైదరాబాద్, ముంబయి, బీహార్ శాసనసభలోనూ చేనేత ఉత్పత్తుల తయారీపై తీర్మానాలను ఆమోదించడం విశేషం. చీరాల సహకార స్పిన్నింగ్ మిల్లు శంకుస్థాపనను ఆనాటి ప్రధానమంత్రి జవహర్ లాల్ నెహ్రూతో కోటయ్య చేయించారు. 200కు పైగా చేనేత సహకార సంఘాలు ఏర్పాటు చేయించారు. ప్రగడ కోటయ్య కేవలం చేనేత రంగ సమస్యలపైనే కాకుండా రైతుల కోసం, పేదల కోసం కూడా పోరాడారు. చీరాలలో 17 వేల ఎకరాలకు పైగా బంజరు భూములను పేదలకు పంపిణీ చేయడంలో కీలక పాత్ర పోషించారు. చేనేత రంగానికి, నేతన్నల అభ్యున్నతికి తన జీవితాన్ని ధారబోసిన ప్రగడ కోటయ్య సేవా స్ఫూర్తి గురించి భావి తరాలకు తెలియజేయలన్న సంకల్పంతో కూటమి ప్రభుత్వం ఆయన జయంతిని రాష్ట్ర పండుగగా నిర్వహించాలని నిర్ణయించింది. ఈ నేపథ్యంలో చీరాలలో జరిగే ప్రగడ కోటయ్య రాష్ట్ర స్థాయి జయంతి కార్యక్రమానికి రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత ముఖ్య అతిథి పాల్గొననున్నా రని మంత్రి కార్యాలయం శనివారం ఒక ప్రకటనలో తెలిపింది.

# వైకాపా సీనియర్ నాయకులు రామసిద్ధారెడ్డి సేవలు చిరస్మరణీయం..!

**కడప పార్లమెంటు సభ్యులు వైయస్ అవినాష్ రెడ్డి**

**కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎంపీ**

**చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన వైఎస్సార్‌సీపీ నాయకులు**



**వేముల మన జనప్రగతి జూలై 25:-** వైఎస్సార్‌సీపీ నాయకుడు రామిరెడ్డి రామసిద్ధారెడ్డి పార్టీకి చేసిన సేవలు, ప్రజలకు అందించిన సహకారం ఎప్పటికీ గుర్తుండిపోతాయని కడప పార్లమెంట్ సభ్యుడు వైఎస్ అవినాష్ రెడ్డి అన్నారు.వేముల మండలం నల్లచెరువుపల్లి గ్రామానికి చెందిన దివంగత రామిరెడ్డి రామసిద్ధారెడ్డి కుటుంబ సభ్యును శనివారం ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి పరామర్శించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నాగేళ్ల సాంబశివారెడ్డి, జడ్పీటీసి కోకటం వెంకట బైయపిరెడ్డిలతో కలిసి ఆయన కుటుంబ సభ్యులను కలుసుకుని వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ..పార్టీ పట్ల రామసిద్ధారెడ్డి చూపిన నిబద్ధత, నాయకులు,కార్యకర్తలతో ఆయనకు ఉన్న అనుబంధం ఎప్పటికీ మరువలేనిదని అన్నారు.పార్టీ బలోపేతానికి, ప్రజా సేవలో ఆయన అందించిన సహకారం చిరస్మరణీయమని పేర్కొన్నారు. రామసిద్ధారెడ్డి కుటుంబానికి వైఎస్సార్‌సీపీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఆపద సమయంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని, ఎలాంటి అవసరం వచ్చినా తనను సంప్రదించవచ్చని తెలిపారు. అంతకు ముందుగా దివంగత రామసిద్ధారెడ్డి దంపతుల చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులు సతీష్ రెడ్డి, ధనలక్ష్మిలను ఎంపీ అవినాష్ రెడ్డి పరామర్శించి వారికి మనోధైర్యం కల్పించారు. వైస్ ఎంపీపీ నరసింహారెడ్డి, వైకాపా బీసీ విభాగం ప్రధాన కార్యదర్శి కొట్లూరు సుదర్శన్,పార్టీ కార్యకర్తలు ప్రసాద్ రెడ్డి, నరసింహారెడ్డి, రమణారెడ్డి, గంగిరెడ్డి, వెంకటలక్ష్మి రెడ్డి, నారాయణ రెడ్డి, సుధాకర్ రెడ్డి, జనార్దన్ రెడ్డి,జిల్లా మరియు తదితరులు పాల్గొని రామసిద్ధారెడ్డికి ఘన నివాళులర్పించారు.




# లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ విధులపై రివ్యూ

- మొదటి అదనపు జిల్లా జడ్జి ఎన్.శాంతి అధ్యక్షత
- ప్యానెల్ లాయర్లతో సమీక్ష సమావేశం

**కడప మన జనప్రగతి జూలై 25:-**జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కడప ఆధ్వర్యంలో లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్, ప్యానెల్ లాయర్ల విధులపై శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, అమరావతి ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్-కం-జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సి. యామిని సూచనలతో, మొదటి అదనపు జిల్లా జడ్జి శ్రీమతి ఎన్. శాంతి అధ్యక్షతన, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి-కం-సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్ ఆధ్వర్యంలో కడప కోర్టు ప్రాంగణంలోని న్యాయ సేవా సదన్‌లో ఈ సమావేశం జరిగింది.ఈ సందర్భంగా ప్యానెల్ లాయర్లు, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్స్ నిర్వహిస్తున్న కేసుల పురోగతి, విధుల నిర్వహణ, కక్షిదారులకు అందిస్తున్న చట్టపరమైన సలహాలు, జైలు సందర్శనలు, కేసుల పరిష్కార ప్రక్రియ తదితర అంశాలపై సమగ్రంగా సమీక్షించారు. నాణ్యమైన ఉచిత న్యాయ సహాయం అందించే దిశగా మరింత సమర్థవంతంగా విధులు నిర్వహించాలని సూచించారు.ఈ సమావేశంలో లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్స్, ప్యానెల్ లాయర్లు పాల్గొన్నారు.

# అంగ రంగ వైభవంగా తొలి ఏకాదశి వేడుకలు

**- పెద్దూరు శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో**



**గాలివీడు మన జనప్రగతి జూలై 25:-** గాలివీడు మండల కేంద్రంలోని పెద్దూరు బ్రాహ్మణవీధిలో వెలసిన శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో తొలి ఏకాదశి వేడుకలు శనివారం అత్యంత భక్తిశ్రద్ధలతో, వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే ఆలయంలో ప్రత్యేక సుప్రభాత సేవ, అభిషేకం, అర్చన, సహస్రనామార్చన, ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో,పూలతో సుందరంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొని తమ మొక్కులు తీర్చుకున్నారు. అలయానికి వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు ఏర్పాట్లను పర్యవేక్షించి భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించారు. తొలి ఏకాదశి సందర్భంగా ఆలయ ప్రాంగణం గోవింద నామస్మరణతో మారుమోగి ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

PRINTER, PUBLISHER AND OWNED BY **YADATI VIVEKANANDA REDDY YADAV**, AND PRINTED AT M/S GOKUL PUBLICATIONS, # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), PUBLISHED AT # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), Editor : YADATI VIVEKANANDA REDDY YADAV, E-Mail :manajanapragathi@gmail.com, Cell : 8125555507 RNI No : - APTEL/2021/80174